Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.06.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 5

కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# 'కులం' కుంపట్లో 'దేశం'

- ఏపిలో మితిమీరిన కుల రాజకీయాలు
- కులానికొక కుంపటి పెట్టింది చంద్రబాబే!
- రాష్ట్రంలో మారుతున్న కుల సమీకరణలు



**2014** ఎన్నికల్లో అధికారం కోసం, తన పార్టీ గెలుపు కోసం చంద్రబాబునాయుడు ఏ కులాలనైతే రెచ్చగొట్టాడో, పదవుల పేరుతో, ప్రయోజనాల పేరుతో ఏ ప్రజలనైతే చీలగొట్టాడో అవే కులాలు ఇప్పుడు చంద్రబాబు పాలిట శాపంగా మారాయి. ఆ కులాలన్నీ చంద్రబాబుకు వ్యతిరేకంగా మారుతున్నాయి. ఓ పక్క మతాలను మరచిపోదాం, కులాలను నిర్మూలిద్దామంటూ పోరాటాలు జరుగుతుండగా, చంద్రబాబు 2014 ఎన్నికల్లో కులం కార్డులు ప్రయోగించే అధికారంలోకి వచ్చాడు. ఒక్కో కులానికి ఒక్కో రకమైన హామీ ఇచ్చారు. కులాల వారీగా కార్పొరేషన్లు, పథకాలు చేపట్టారు. కాని, ప్రజాస్వామ్య వ్యవస్థలో కుల రాజకీయాలను ఎక్కువకాలం చేయలేరు. కులాల పరంగా ఓటు బ్యాంకును ఎక్కువకాలం నిలుపుకోలేరు.

ఇన్నేళ్ళ రాజకీయ చరిత్రలో ఏపి రాజకీయాలపై కుల ప్రభావం చాలా తక్కువుగా వుండేది. ఇక్కడ కులంకంటే నాయకుల గుణగుణాలకు ప్రాధాన్యత ఉండేది. మొదటిసారి 2014 ఎన్నికల్లో (మిగతా 11వ పేజీలో)


అద్భుత యోగాసనాలతో ఆశ్చర్యపరచిన

# నెల్లూరమ్మాయి

3లో



రాజ్‌భవన్ నుండి రాష్ట్రపతిగా...



# కృష్ణుడికి కష్టం రాముడికి పట్టం

- బీజేపీ దళిత అస్త్రం
- మెజార్టీ పక్షాల మద్దతు
- రామరథ సారధికి మొండిచేయి

అద్వానీ... సుష్మాస్వరాజ్... మురళీమనోహర్ జోషి... రతన్ టాటా... ఇన్ఫోసిస్ నారాయణమూర్తి... అమితాబ్‌బచ్చన్... మోహన్ భాగవత్... రాష్ట్రపతి రేసులో చక్కర్లు కొట్టిన పేర్లు. వీరిలో ఎవరో ఒకరి పేరు ఖాయమనుకున్నారు. తీరా చూస్తే ఎవరూ వూహించని పేరు వెలువడింది. ప్రతిపక్షాలకు ఎలాంటి పోబిడి ఇవ్వకుండా, వేలెత్తి వంక చూపే వీలు లేకుండా దళిత వర్గాలకు చెందిన బీహార్ గవర్నర్ రామ్‌నాథ్ కోవింద్‌ను ఎన్డీఏ తరఫున రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. (మిగతా 11వ పేజీలో)

గ్రేట్ ఆడి & రంజాన్
డబుల్ సెలబ్రేషన్స్
FLAT 50% OFF FLAT 30% OFF FLAT 20% OFF
ఫ్యాన్సీ, డిజైనర్ శారీస్, సల్వార్స్, డ్రస్ మెటీరియల్స్, ఫ్యాన్సీ పావడాస్, లేడీస్ వెస్ట్రన్‌వేర్, సూటింగ్స్ & షర్టింగ్స్, కిడ్స్‌వేర్, బ్రాండెడ్ మెన్స్‌వేర్‌పై..
*పట్టు చీరలు వీవర్స్ ధరలకే...
T&C Apply
నేడే కొనండి.. తర్వాత చెల్లించండి..!
kotak AXIS BANK HDFC BANK ICICI Bank RBL BANK SBI Card IndusInd Bank HSBC Standard Chartered Union Bank
ఈ క్రెడిట్ కార్డుల్లో ఏదైనా సరే...
• 5 వేల రుపాయలు కోనుగోలుపై
• వడ్డీ 0% • EMI 6 నెలలు
ఈ ఆఫర్ అన్నింటిపై..
కళానికేతన్ షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677
contact@eyecatch.co.in

ఇది ఎలక్షన్ బదిలీ?

# కొత్త ఎస్పీగా రామకృష్ణ ఈస్ట్‌కు విశాల్





**జి**ల్లా ఎస్పీ విశాల్‌గున్నీని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా బదిలీ చేసారు. నెల్లూరుజిల్లా కొత్త ఎస్పీగా పిహెచ్‌డి రామకృష్ణను నియమించారు. 13నెలల కాలంగా కడప జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేసారు. కృష్ణాజిల్లా కైకలూరుకు చెందిన రామకృష్ణ 1998లో గ్రూప్-1 పోటీ పరీక్షల ద్వారా పోలీసు శాఖలో చేరారు. 2001లో డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. నల్గొండ, వరంగల్, తూర్పుగోదావరి జిల్లాల్లో డిఎస్పీగా పని చేశారు. 2007లో ఏఎస్పీగా పదోన్నది పొందారు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఓఎస్‌డిగా, నల్గొండలో ఓఎస్డీగా విధులు నిర్వహించారు. 2009లో నాన్‌కేడర్ ఎస్పీగా పదోన్నతి లభించింది. హైదరాబాద్‌లో కౌంటర్ ఇంటెలిజన్స్, ఎస్‌ఐబి విభాగాలలో నాలుగేళ్లపాటు పని చేశారు. 2013 అక్టోబర్‌లో చిత్తూరు ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అక్కడనుండి గుంటూరురూరల్ ఎస్పీగా వెళ్లారు. 2016 మే 11వ తేదీన కడప ఎస్పీగా (మిగతా 11వ పేజీలో)

# అసంబద్ధ వెబ్‌కౌన్సిలింగ్‌ను ఎత్తివేయాలి




అసంబద్ధంగా ఉన్న వెబ్‌కౌన్సిలింగ్, రేషనలైజేషన్‌లకు నిరసనగా బుధవారం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ముట్టడించారు. లోనికి రాకుండా గేట్లు మూసివేశారు. గేటు ముందు భారీసంఖ్యలో తరలివచ్చిన ఉపాధ్యాయులు రేషన్‌లైజేషన్‌ను ఎత్తి వేయాలని, అసంబద్ధంగా ఉన్న వెబ్ కౌన్సిలింగ్‌ను రద్దు చేసి సాధారణ బదిలీలు నిర్వహించాలని, పెర్ఫార్‌మెన్స్ పాయింట్లను తీసివేయాలంటూ నినాదాలు చేశారు. కార్యాలయానికి విధుల కోసం వస్తున్న సిబ్బందిని సైతం లోనికి పోనివ్వకుండా నిరసనకారులు అడ్డుకున్నారు. ఒక దశలో ఉపాధ్యాయులు కార్యాలయం గేటును తోసుకుని లోనికి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయితే ముందు జాగ్రత్తగా భారీగా మోహరించిన పోలీసులు వారిని నిలువరించారు. విద్యాశాఖాధికారి వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గేటు వద్ద బైఠాయించారు. ఎంతకీ విద్యాశాఖాధికారి రాకపోవడంతో వారంతా కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి జిఎన్‌టి రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్లు కిక్కిరిసిపోయి రాకపోకలు స్థంభించాయి.

ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెర్ఫార్‌మెన్స్ పాయింట్లు గందరగోళంగా మారుతున్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదన్నారు. రేషనలైజేషన్ పేరుతో జిల్లాలో వున్న 67 ప్రాథమిక పాఠశాలలు ఎత్తివేయడం దారుణమన్నారు. అంతేకాకుండా 147 పాఠశాలల స్థాయిని తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. వీటి వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రేషన్‌లైజేషన్‌ను వెనక్కు తీసుకోవాలని హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఫ్యాప్టో ఛైర్మెన్ రమణయ్య, జాక్టో కన్వీనర్ కృష్ణారెడ్డి, యూటిఎఫ్ నేత నవ కోటేశ్వర రావు, ఏపిటిఎఫ్ నాయకులు ఉదయ భాస్కర్, ఉపాధ్యా సంఘ నేతలు సురేంద్ర, సుబ్రహ్మణ్యం, వల్లి రాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వేణు, రమేష్ పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# భోజన పథకాన్ని ప్రైవేటుకు ఇస్తే ఊరుకునేది లేదు

పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తే ఊరుకునేది లేదని సిఐటియూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.మోహన్‌రావు అన్నారు. సోమవారం పథకానికి చెందిన కార్మికులతో కలిసి నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లోనే చంద్రబాబు సీఎంగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించే బాధ్యతలు డ్వాక్రా మహిళలకు అప్పగించారని గుర్తు చేశారు. తాజాగా ప్రభుత్వం నగరానికి చుట్టుపక్కల 20కి.మీ దూరంలో ఉండే పాఠశాలలకు సంబంధించి భోజన పథకాన్ని ఒకే సంస్థకు అప్పగించేలా ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో డ్వాక్రా మహిళలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పథకం గౌరవాధ్యక్షురాలు రెహెనా బేగం, అధ్యక్షురాలు విజయమ్మ, కార్యదర్శి బుజ్జమ్మ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.



## వెంగమాంబ తిరునాళ్ళ

## ఆదాయం 38.85 లక్షలు

దుత్తలూరు మండలంలోని నర్రవాడలో వెలసివున్న శ్రీ వెంగమాంబదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి 38.85 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 16న ఆలయ హుండీలను లెక్కించగా హుండీ లెక్కింపు ద్వారా 23,21,485 రూపాయలు, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 7,50,305, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 5,02,000, తలనీలాల టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 20,540లతో పాటు, అన్నదానం విరాళాల ద్వారా రూ. 2,91,331 మొత్తంగా రూ. 38,85,661 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మెన్ పచ్చువ వెంగయ్య, వ్యవస్థాపక ధర్మకర్త మునలయ్య, సర్పంచ్ మేకపాటి మాలకొండ్రాయుడు, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ రమణ, మాజీ సర్పంచ్ మాదాల తిమ్మయ్య, బిజెపి మండల శాఖ ప్రధాన కార్యదర్శి మేకపాటి మాల్యాద్రి, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## మైపాడులో

## వివి వినాయక్ పూజలు



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం మైపాడుతీరంలో కొలువై వున్న శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామికి ఆదివారం ప్రముఖ సినీ దర్శకుడు వి.వి.వినాయక్ సతీసమేతంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ పూజలు, హోమాలు తదితర కార్యక్రమాలను భార్య అనంతలక్ష్మి సమేతంగా నిర్వహించారు. నిర్మాత సి.వి.రావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



# కుంభకోణాల చరిత్ర మీదే!

## - జగన్‌పై సోమిరెడ్డి ధ్వజం

ఎటువంటి ఆరోపణలు వచ్చినా ధైర్యంగా విచారణలు ఎదుర్కొన్న చరిత్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుదేనని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నాడు. ఈ నెల 20వ తేదీన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో దాదాపు 300ఎకరాలకు సంబంధించిన రికార్డులు గల్లంతైతే... ఆ విషయం తన దృష్టికి రాగానే ముఖ్యమంత్రి దీనిపై దర్యాప్తుకు సిట్ వేసాడని అన్నారు. సిబిఐలో పని చేసిన వినీత్‌బ్రిజ్‌లాల్ నేతృత్వంతో పని చేస్తున్న సిట్ ఇప్పటికే తన దర్యాప్తు మొదలుపెట్టి 270 ఎకరాల రికార్డులు టాంపరింగ్ జరిగినట్లు గుర్తించారని, దీనిలో ప్రమేయం వున్న ఇద్దరు తహశీల్దార్లతో పాటు మరికొందరు రెవెన్యూ అధికారుల మీద కూడా వెంటనే చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అవినీతికి పాల్పడితే ఎలాంటి వారినైనా చంద్రబాబు క్షమించడని, ఆయన రాజీపడడని పేర్కొన్నాడు. ఈ భూముల విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఆ జిల్లా మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావులు కూడా తమకు ఈ భూముల కేసులో ఎలాంటి సంబంధం లేదని, అవసరమైతే విచారణకు కూడా సిద్ధమేనని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా సోమిరెడ్డి గుర్తు చేశారు. 11 సిబిఐ కేసుల్లో ఏ1 ముద్దాయిగా వున్న జగన్మోహన్‌రెడ్డి ఏ2గా వున్న విజయసాయిరెడ్డి, ఏ5గా వున్న ధర్మాన ప్రసాదరావు, వోక్స్‌వ్యాగన్ కేసులో ముద్దాయిగా వున్న బొత్స సత్యనారాయణలు విశాఖ భూముల కేసులో మహాధర్నా చేస్తామనడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కూడా పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సెన్స్, లైసెన్స్...

# లేకపోవడం వల్లే న్యూసెన్స్



లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు రవాణా, పోలీసు శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన రోడ్డు భద్రతా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గించాల్సిన అవసరముందన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించకపోవడం, అతివేగం, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, అధికారులు పర్యవేక్షణ కొరవడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనాలు రావడం ఆలస్యాన్ని నివారించడానికి తగు సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొనాల్సిన అవసరముందన్నారు. ఈ నెల 30వ తేదీ ముఖ్యమంత్రి అధ్యక్షతన రోడ్డు భద్రతపై సమీక్షా సమావేశం జరుగుతుందని, ఆ సమావేశానికి జిల్లా ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎన్.శివరాంప్రసాద్ మాట్లాడుతూ గత మే నుండి ఇప్పటివరకు ప్రత్యేకడ్రైవ్ నిర్వహించి రోడ్డు నిబంధనలు పాటించని అనేకమంది వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 34, అధికవేగం కేసులు 6, ఓవర్ లోడ్‌తో వెళుతున్న వాహనాలపై 348 కేసులు, హెల్మెట్ లేనివారిపై 1108, సరైన లైసెన్సు పత్రాలు లేనివారిపై 535 కేసులు, సీట్‌బెల్ట్ లేని వారిపై 889 కేసులు నమోదు చేశామని, ఇంకా ఇతర కేసులు కలుపుకొని మొత్తం 5545 కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు, రెవెన్యూ, ఇతర పలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అద్భుత యోగాసనాలతో ఆశ్చర్యపరచిన...

# నెల్లూరమ్మాయి



నాలుగేళ్ళకే నడుమును విల్లులా వంచింది. ఆరేళ్ల వయస్సులోనే యోగాలో అద్భుత విన్యాసాలు ప్రదర్శించింది. పదేళ్ళ పసిప్రాయంలోనే ప్రపంచస్థాయి యోగా పోటీలలో భారతీయుల సత్తా చాటింది. తన యోగా విన్యాసాలతో ఈమె అమ్మాయేనా? లేక రబ్బరు బొమ్మా? అనేలా ఆశ్చర్యపరుస్తోంది. చివరకు అభివృద్ధిలో అద్భుతాలకు కేరాఫ్ అడ్రస్ నేనేనని చెప్పుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఆమె యోగా విన్యాసాలు చూసి ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టారు. ఆ పాప యోగాసనాలు వేస్తున్నంత సేపు చప్పట్లతో అభినందిస్తూనే ఉన్నారు. ఇలా తన ఆస నాలతో ముఖ్యమంత్రి కూడా ముక్కున వేలేసుకునేలా చేసిన ఆ అమ్మాయి ఎవరో కాదు... మన నెల్లూరమ్మాయే.... మాగుంట లే అవుట్‌కు చెందిన ఏకాంబరం వెంకటేశ్వర్లు - సుజాతల కుమార్తె జ్యోష్ణవి. నెల్లూరుకే కాదు, ఏపికి, భారత్‌కే యోగాలో కీర్తిప్రతిష్టలు తెచ్చిన అంతర్జాతీయ యోగా క్రీడాకారిణి.

ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో జరిగిన 3వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జ్యోష్ణవి తన యోగా విన్యాసాలను ప్రదర్శించింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు మంత్రులు ఎంతో క్లిష్టతరమైన జ్యోష్ణవి యోగాసనాలు ఆశక్తిగా తిలకించి ఆశ్చర్యానికి లోనయ్యారు. యోగాసనాలు పూర్తి కాగానే చంద్రబాబు మైకు తీసుకుని జ్యోష్ణవిని ఒక రబ్బరు బొమ్మగా అభివర్ణిస్తూ, ఆమె విన్యాసాలు తనను ఆశ్చర్యానికి గురి చేసాయన్నారు. యోగా పోటీలలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ రాష్ట్రానికే కీర్తి తెస్తున్న జ్యోష్ణవిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. యోగాలోనే కాకుండా చదువులోనూ ఆమె ఉత్తమంగా రాణించాలని, తన ఆశయం మేరకు సివిల్ సర్వీస్ సాధించాలని సీఎం ఆకాంక్షిస్తూ, ఆమె చదువుల ఖర్చు కోసం ఆమె పేరు మీద 5లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర సాంస్కృతిక క్రీడా మండలిలో జ్యోష్ణవిని సభ్యురాలిగా నియమించే విషయాన్ని పరిశీలించాలని కూడా మంత్రులకు ఆయన సూచించారు. చిన్నతనం నుండే తమ బిడ్డను యోగాలో ప్రోత్సహించిన జ్యోష్ణవి తల్లిదండ్రులను చంద్రబాబు అభినందించారు.







# సంపూర్ణ ఆరోగ్యానికి యోగా!



మానవ జీవన విధానంలో పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా ఉత్తమ మార్గమని ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఆయుష్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రపంచ దేశాలు విశ్వసించాయన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ యోగాకు బహుళ ప్రాచుర్యం కల్పించడంతో పాటు దేశ భవిష్యత్తును ఆరోగ్యవంతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ శరీరం, ఆత్మను ఐక్యం చేసే యోగా సాధనం ఎంతోమేలు చేస్తుందన్నారు. యోగా సాధన క్రమం తప్పకుండా ప్రతిరోజూ చేయాలని సూచించారు. అనంతరం వివిధ యోగా ప్రదర్శనలు చేసారు. జాతీయ స్థాయిలో యోగాలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి, డిఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిఎస్‌డిఓ రమణయ్య, నాగేంద్రప్రసాద్, వంశీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# టిజిపి ప్రత్యేక కలెక్టర్‌కు జాతీయ అవార్డు



తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్ పి.ప్రశాంతి ఉపాధిహామీ పథకం అమలుకు సంబంధించి జాతీయ అవార్డు అందుకున్నారు. సోమవారం ఢిల్లీలో జాతీయ స్థాయిలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నరేంద్రసింగ్‌తోమార్ నుంచి ఆమె అవార్డును అందుకున్నారు. విజయనగరం జిల్లాలో ప్రశాంతి డ్వామా పీడీగా విధులు నిర్వహించారు. ఉపాధిహామీలో చేసిన ప్రగతిని కేంద్ర అవార్డుల కమిటి ఎదుట ప్రదర్శించారు. ఉపాధిహామీ పనులు చేయడంలో ప్రగతి సాధించినందుకు జాతీయ అవార్డులకు ప్రశాంతిని కేంద్ర అవార్డుల కమిటి ఎంపిక చేసింది. ప్రస్తుతం ప్రశాంతి నెల్లూరు తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. అవార్డు అందుకున్న ఆమెను కార్యాలయం అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

# 'ప్రభా'తం

# ఇక... జిఎస్‌టి శకం

**ఇక జిఎస్‌టి శకం రాబోతోంది. పన్నుల వ్యవస్థలోనే ఇదొక పెద్ద మార్పు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఇది ఒక అతిపెద్ద పరోక్ష పన్నుల సంస్కరణ. అందుకే ఇది ఎంతో చరిత్రాత్మకమైనది. దేశ ఆర్థిక వ్యవస్థను ద్విగుణీకృతం చేసే ఇలాంటి సంస్కరణలు అవసరం కూడా. అనేక సార్లు వాయిదాలు పడినా, ఎట్టకేలకు జిఎస్‌టిని అమలులోకి తెచ్చేందుకు కేంద్రం, ప్రత్యేకించి ప్రధాని మోడీ చేస్తున్న కృషి అమోఘం. ఈ జిఎస్‌టి శకం దేశ ఆర్థికాభివృద్ధికి..దేశాభ్యుదయానికి మేలుబాటలు పరుస్తుందని ఆశిద్దాం.**

ఎట్టకేలకు దేశవ్యాప్తంగా ఇక జిఎస్‌టి శకం ప్రారంభం కానుంది. వచ్చే వారానికల్లా జిఎస్‌టి (వస్తు సేవల పన్ను) అమలులోకి రానుంది. ఈ నెల 30వ తేది అర్ధరాత్రి నుంచి జిఎస్‌టి ఆచరణలోకి వచ్చేస్తుంది. ఇది ఎంతైనా శుభ పరిణామం. చరిత్రాత్మకం కూడా.

ఇదే కాదు, ఏ సంస్కరణ అయినా, ప్రజల జీవనసరళిలో మంచి మార్పులు తెచ్చే ఏ మార్పుకైనా స్వాగతం పలకాల్సిందే. ఇది దేశచరిత్రలోనే ఒక పెద్ద సంస్కరణ. అందులోనూ అతిపెద్ద పరోక్ష పన్నుల సంస్కరణ. దీనిని ఇంత పెద్దదేశంలో అమలుచేయడమంటే మాటలతో పనికాదు. ఎంతో ముందస్తు కసరత్తు అవసరం. అన్నీ ఒక కొలిక్కి వచ్చాకే దీని అమలుకు రంగం సిద్ధమైంది. ప్రధాని నరేంద్రమోడీ సకలజన సంక్షేమం కోసం చేస్తున్న మరో బృహత్ప్రయత్నమే ఇది. ఇప్పటికే రాష్ట్రాల అభిప్రాయాలను, ఆర్థికవేత్తలు..మేథావుల సూచనలన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, జిఎస్‌టి అమలులో వచ్చే సాధక బాధకాలన్నిటినీ ఆమూలాగ్రం చర్చించారు. దాదాపు పన్నెండువందలకు పైగానే వస్తువులు, అయిదు వందల రకాల సేవలకు ధరలను నిర్ణయించి, నిర్దేశిత రేట్ల ప్రకారమే అవి ప్రజలకు అందుబాటులో వుండేందుకు భారీ ప్రయత్నాలే చేస్తున్నారు. దీని అమలులో ఏవైనా అవాంతరాలు ఏర్పడితే వాటిని అధిగమించడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిఎస్‌టి అమలులోకి వస్తే నిత్యం ప్రజలకు అవసరమైన పాలు, కూరగాయల ధరలు, ఆహారధాన్యాలు, పండ్లు వగైరాల ధరలు అయిదు శాతం దాకా తగ్గవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. మరికొన్ని రకాల వస్తువులపై కూడా పన్నులు తగ్గించేందుకు కూడా రంగం సిద్ధమైంది. ఇవన్నీ అమలులోకి వస్తే ముఖ్యంగా దేశవ్యాప్తంగా సామాన్య జనానికి, మధ్యతరగతి ప్రజలకు మండే ధరల ప్రభావం నుంచి కొంతమేరకు ఉపశమనం లభించినట్లే అవుతుందని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

అయితే, కొన్ని పరిశ్రమలకు, చిన్న మధ్య తరగతి సంస్థలకు, ప్రధానమైన ఆలయాలకు జిఎస్‌టి నుంచి మినహాయింపులు లేకపోవడం వంటి విమర్శలూ జోరుగానే వున్నాయి. రైతులు కొనుగోలు చేసే ట్రాక్టర్ వంటి యంత్రాలు వగైరాలకు కూడా జిఎస్‌టి వల్ల అదనపు భారం పడుతుందేమోనన్న ఆందోళనలూ అధికంగానే వున్నాయి. జిఎస్‌టితో మందుల ధరలు మరింత పెరుగుతాయేమోననే ఆందోళన ప్రజల్లో వుంది. ప్రజలకు నిత్యావసరాలు, అత్యవసరాలైన వాటి ధరలు పెరగకుండా, వీలైతే ఆయా వస్తువుల ధరలు బాగా తగ్గేవిధంగా చూస్తే జిఎస్‌టికి సామాన్య ప్రజల నుంచి కూడా మంచి మద్దతు లభిస్తుంది. ముఖ్యంగా ప్రజలకు ఎంతో అవసరమైన మందుల ధరలు ఏమాత్రం పెరగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా వుంది. పన్నుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళనం చేయాలన్న ఆలోచన ఎంతో ఆహ్వానించదగ్గదే అయినా, అందువల్ల ప్రజలు, వ్యాపారవర్గాలు, పారిశ్రామికవర్గాలు ఎవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు ముందస్తు ఆలోచనలతో అమలుకు ఉపక్రమించడం ఎంతైనా శ్రేయోదాయకమని వేరే చెప్పనక్కరలేదు. అయితే, జిఎస్‌టి వల్ల తమపై ఇంకా వేధింపులు పెరుగుతాయేమోననే అనుమానాలు వ్యాపారవర్గాల్లో బలంగానే వున్నాయి. జిఎస్‌టి అమలులో భాగంగా, వ్యాపారులు రిటర్నులు దాఖలు చేసే విషయంలో సంయమనం ప్రదర్శించాలి. లేకుంటే, కొత్త వ్యవస్థ అందుబాటులోకి రాకుండానే విమర్శల వెల్లువ తప్పదు. దేశ ఆర్థిక సంస్కరణలకు సంబంధించి ఎంతో ముఖ్యమైన ఇలాంటి చట్టాల అమలులో అన్నివర్గాల, అన్నిరకాల ఆవేదనలను సహృదయంతో అర్థం చేసుకుని ఏ మార్గం అందరికీ అనువుగా వున్నదో పరిశీలించి, ఆ మార్గాన్నే అనుసరణీయంగా నిర్ధారించుకోవాల్సి వుంది. అదేసమయంలో అటు జిఎస్‌టి అమలుకు, ఇటు దేశ సౌభాగ్యానికి ఎలాంటి ఢోకా లేకుండా సరళమైన, ఆచరణసాధ్యమైన మార్గంలో మన విధానాలు పయనించాల్సి వుంది. సమస్యలన్నవి సాధారణమే అయినా, వాటిని ఒక సవాల్‌గా తీసుకుని అధిగమించినప్పుడే సత్ఫలితాలు వస్తాయి. కొత్త విధానాలేవైనా అమలులోకి వచ్చినప్పుడు సహజంగానే సమస్యలుంటాయి.. పెద్దనోట్ల రద్దు విషయంలో జరిగిందదే. తొలుత కష్టసాధ్యమనుకున్నది ఆ తర్వాత సులభసాధ్యమే అయింది. కొన్ని సమస్యలు వున్నప్పటికీ, ముఖ్యంగా దేశప్రయోజనాల దృష్ట్యా చేసే ఇలాంటి బృహత్కార్యాలను అపార్థం చేసుకోవడం సముచితం కాదు. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత కొద్ది నెలలు కూడా ఇలాగే రకరకాల సమస్యలన్నీ బయట పడతాయి. వాటిని సంయమనంతో పరిష్కరించు కోవాల్సి వుంది. పన్ను చెల్లింపుదారులకు జిఎస్‌టి అంటేనే అదేదో భయపడే విషయంగా కాకుండా, ప్రభుత్వం దానిపై అందరికీ ఒక మంచి అవగాహన కలిగించడం, దాని అమలుకు సరళతరమైన దారి చూపడం తప్పనిసరి. రిటర్నులు దాఖలు చేయడానికి నిర్ణయించిన గడువులో తొలి రెండు నెలలు వ్యాపారులకు కొంత వెసులుబాటు కలిగిస్తామని కేంద్రమంత్రి భరోసా ఇవ్వడం పన్ను చెల్లింపుదారులకు కొంతమేరకు వెసులుబాటే. అయితే, అవసరమైతే ఆ గడువును మరికొంతకాలం పొడిగించేందుకు వీలుంటే ఇంకా మంచిదని, సరికొత్త సంస్కరణలు అందరికీ అలవాటయ్యేదాకా కొంత పట్టువిడుపులు అవసరమనే అభిప్రాయాలూ వున్నాయి.

ఏదేమైనా, దేశ ఆర్థికవ్యవస్థను ద్విగుణీకృతం చేసే ఇలాంటి సంస్కరణలు మంచివే. వాటిని పారదర్శకంగా, పటిష్టంగా అమలుచేయడమే ఇక ముందున్న కర్తవ్యం. అనేకసార్లు వాయిదాలు పడినా, ఎట్టకేలకు జిఎస్‌టిని అమలులోకి తెచ్చేందుకు కేంద్రప్రభుత్వం, ప్రత్యేకించి ప్రధాని మోడీ చేస్తున్న కృషి అమోఘం. ఈ జిఎస్‌టి శకం..దేశానికి ఒక శుభపరిణామంగా, ఆర్థికాభ్యుదయ శకంగా వర్ధిల్లాలని ఆశిద్దాం!...

# సంయుక్తకు చేయూత






నెల్లూరుజిల్లా కావలి పట్టణంలోని సంయుక్త సేవాసంస్థకు దాత హరినాథ్‌రెడ్డి అన్నదానం, నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. సేవాసంస్థ చేస్తున్న సేవలను తెలుసుకున్న 1వ పట్టణ కానిస్టేబుల్ సత్యం వంట సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా 2వ పట్టణ సిఐ జి.ఎల్.శ్రీనివాసరావు, ఎస్సై సిహెచ్ వాసు మాట్లాడుతూ గత 25నెలలుగా సంయుక్త సేవాసంస్థ నిరుపేదలకు సేవలందించి వారిని ఆదుకోవడం అభినందనీయమన్నారు. సంస్థ అధినేత సురేంద్ర చేస్తున్న సేవలకు తమవంతు సహకారాన్ని అందిస్తామని దాత హరినాథ్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా పలువురు దాతలు కుర్చీలు, వంట సామాగ్రి తదితరాలను సంస్థకు అందజేశారు. గ్రంథం ప్రసన్నాంజనేయులు, కౌన్సిలర్ రాజు, డాన్స్ మాస్టర్ ఉమామహేశ్వరరావు, శారద, ఎస్.కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం



ఇటీవల వడదెబ్బతో మృతిచెందిన నెల్లూరులోని ఓ దినపత్రికలో పనిచేస్తున్న రిపోర్టర్ పెంచలప్రసాద్ కుటుంబానికి నెల్లూరు హర నాథపురం రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి ఈ నెల 17వ తేదీన ప్రెస్‌క్లబ్‌లో రూ. 10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు పెంచలప్రసాద్ కుమారుడు కోట ప్రభాత్ విద్యాభివృద్ధి కోసం కావలసిన ఆర్థిక సాయాన్ని ప్రతి సంవత్సరం అందజేస్తానన్నారు. రూ. 10వేల చెక్కును పెంచలప్రసాద్ భార్య లక్ష్మికి అందజేశారు. హరనాథపురం రెసిడెన్షియల్ అసోసియేషన్ కార్యదర్శి డి.రవీంద్రరెడ్డి, కోశాధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.




# కమ్యూనిటీ పోలీసింగ్ అభినందనీయం

జిల్లాలో నేర నియంత్రణకు కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఎస్పీ విశాల్ గున్నీ తీసుకున్న నిర్ణయం సముచితం, అభినందనీయం. ప్రజల భాగస్వామ్యంతో నడిచే ఈ వ్యవస్థ రాష్ట్రానికే ఆదర్శం. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 3000మంది ప్రజలు ఈ వ్యవస్థలో చేరేందుకు స్వచ్ఛందంగా తమ పేర్లు నమోదు చేసుకోవడం ఎస్పీ సమర్థతపై జిల్లా ప్రజలకు వున్న నమ్మకానికి నిదర్శనం. ఇప్పటికే ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ట్విట్టర్, స్కైప్, పబ్లిక్ ఐ లాంటి సోషల్ మీడియాను ఉపయోగించి నేరాలను కట్టడి చేసిన ఎస్పీ ఈ కమ్యూనిటీ పోలీసు వ్యవస్థతో జిల్లాను నేర రహితంగా మార్చేందుకు కృషి చేయడం అభినందనీయం. అలాగే పోలీసు శాఖను సంస్కరిస్తూ, పోలీసులలో జవాబుదారీతనం పెంపొందించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రజా ఎస్పీగా ప్రజల చేత ప్రశంసలు అందుకున్నారు. మానవీయ కోణాన్ని అనుసరిస్తూ పేదలకు సత్వర న్యాయం అందించేందుకు ఆయన చేసిన కృషి ప్రశంసనీయం. అలాంటి మంచి అధికారి బదిలీ కావడం జిల్లాకు కొంత లోటే!

**ఎస్.బాబురావు, కావలి.**

# అతని మీద గౌరవం పోయింది

శ్రీకాకుళం జిల్లాకు చెందిన పేదింటి పిల్లోడు కోణంకి గోపాలకృష్ణ జాతీయ స్థాయి సివిల్స్‌లో 3వ ర్యాంకు తెచ్చుకున్నందుకు అందరూ అభినందించారు. ఆనందించారు. అయితే ఇటీవల ఒక కార్యక్రమంలో అతను ముఖ్యమంత్రి చంద్రబాబును పొగిడిన తీరు చూస్తే తెలుగుదేశంలో ఉన్న భజనపరులు కూడా అతని ముందు సాటిరారనిపించింది. అసలు ఇలాంటి వాళ్ళు ఐఎఎస్‌లు ఎందుకవుతారో? ఇంకో 20ఏళ్ల పాటు సీఎంగా చంద్రబాబే ఉండాలంటూ గోపాలకృష్ణ మాట్లాడారు. ఎవరు ఎంత కాలం సీఎంగా ఉండాలన్నది ప్రజలు నిర్ణయిస్తారు... కోణంకి గోపాలకృష్ణ లాంటివాళ్ళు కాదు. అసలు అతను సివిల్ సర్వీస్ ఆఫీసర్‌గా కంటే తెలుగుదేశం కార్యకర్తగానే పనిచేసేటట్లున్నాడు.

**- దిన్నె రామ్, నెల్లూరు.**

# నిరాశపరచిన భారత్

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాకిస్థాన్ చేతిలో భారత్ ఓటమి పాలు కావడం క్రికెట్ అభిమానులను నిరాశపరచింది. భారత్‌కు గట్టి బ్యాటింగ్ లైనప్ వున్నా ఒక్క హార్ధిక్‌పాండ్య మినహా ఎవ్వరూ సరిగా ఆడకపోవడం విచారకరం. అతను ఉన్నంత సేపు మ్యాచ్ రసవత్తరంగా ఉండింది.

**జలి, నెల్లూరు.**

# ప్రభుత్వ ఆస్తులు కాపాడండి

ఇసుకాసురులు, భూబకాసురులు, అత్యాచార గ్యాంగులు, మైకాసురులు... రాష్ట్రంలో విస్తరించి వున్నారు. గనులను, భూములను కొల్లగొడుతున్నారు. లంచాలు లక్షలు దాటి కోట్లకు చేరాయి. నెల్లూరు నగరంలో ఎన్నో ప్రభుత్వ స్థలాలున్నాయి. దేవుడి బొమ్మలు అడ్డం పెట్టి ఆక్రమించేస్తున్నారు. పార్టీ జెండాలు పాతేసి అన్యాక్రాంతం చేసుకుంటున్నారు. నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలో కార్పొరేషన్‌కు చెందిన స్థలాన్ని కొందరు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. కమిషనర్ వెంటనే చొరవ తీసుకుని దీనిని కాపాడుకోవాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

• జిల్లాలో వైకాపా...

# బలముంది... బలమైన నాయకత్వమే కావాల్సివుంది



**రాష్ట్రంలోనే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలంగా వున్న జిల్లాల్లో నెల్లూరొకటి. కడప, కర్నూలు తర్వాత నెల్లూరుజిల్లానే వైసిపికి కంచుకోట! ఇంకోరకంగా చెప్పాలంటే ఆ రెండు జిల్లాల్లో వైసిపి నుండి గెలిచిన ఎమ్మెల్యేలు ఎక్కువ మంది తెలుగుదేశంలోకి జంప్ అయినా, నెల్లూరుజిల్లాలో మాత్రం ఒకే ఒక ఎమ్మెల్యే జంప్ చేశాడు. మిగతా ఆరుగురు ఎమ్మెల్యేలు జగన్ వైపు విశ్వాసంతో నిలిచారు.**

నెల్లూరుజిల్లాలో వైసిపి బలంగానే ఉన్నప్పటికి 2014 ఎన్నికల్లో కొన్ని లోపాలు తలెత్తాయి. ముఖ్యంగా ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మీద వ్యతిరేకత బలంగా కనిపించింది. కాబట్టే లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీలకు గాను ఐదింటిలో వైసిపి అభ్యర్థులు గెలిచినా మేకపాటి ఎంపీగా కేవలం 13వేల ఓట్ల తేడాతో మాత్రమే గెలవగలిగాడు. అసెంబ్లీ మెజార్టీలను లెక్కలోకి తీసుకున్నా దాదాపు అతను లక్ష మెజార్టీతో గెలిచి ఉండాలి.

ఇక అసెంబ్లీలలో చూస్తే ఉదయగిరి, వెంకటగిరి, కోవూరులను ఆరోజు వైసిపి కోల్పోవడం జరిగింది. ఎంపి అభ్యర్థి పట్ల అనుకూలధోరణి, ఆయన నుండి పూర్తి స్థాయిలో ఆర్థిక సహకారం ఉండుంటే ఉదయగిరి, కోవూరు స్థానాలను కూడా వైసిపి గెలిచివుండేది. ఇక వెంకటగిరి వైసిపి అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్య నిర్లక్ష్య ధోరణి, వెంకటగిరి పట్టణంపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం వంటి లోపాల వల్ల ఆ సీటును కోల్పోవాల్సి వచ్చింది.

ఇప్పటికీ జిల్లాలో పార్టీ బలంగానే ఉందిగాని, సరిదిద్దు కోవాల్సిన లోపాలు చాలానే వున్నాయి. ముఖ్యంగా లోక్‌సభ అభ్యర్థిగా కొత్త నాయకుడిని తెరమీదకు తీసుకురావాల్సిన అవసరముంది. సీనియర్ నాయకుడిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి సేవలను పార్టీకి ఇంకో రూపంలో వాడుకోవాలి. లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ అభ్యర్థులకు అన్ని విధాలా అండగా నిలిచే అభ్యర్థిపై దృష్టి పెట్టాలి. అసెంబ్లీ వారీగా చూసినా పలు నియోజకవర్గాల్లో నాయకత్వ సమస్య వుంది. నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, కావలి, సూళ్ళూరుపేటలలో సిటింగ్ ఎమ్మెల్యేలు ఇబ్బంది లేకుండా పని చేసుకుంటున్నారు. ప్రజల్లో వాళ్ల మీద వ్యతిరేకత లేదు. ఆత్మకూరు సీటు విషయాన్ని ఆలోచించాల్సి వుంది. ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అయితే సిటింగ్ ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి సరిపోడనిపిస్తుంది. ఎమ్మెల్యేగా గౌతంరెడ్డి మీద వ్యతిరేకత లేకున్నా నియోజకవర్గంలో ఆనంకు ప్రజల్లో పరపతి, పని చేసాడనే పేరు, బంధుగణం బలంగానే వుంది. ఆ దృష్టితో ఆత్మకూరు అభ్యర్థిని అన్వేషించాలి. ఉదయగిరిలో సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పట్ల వ్యతిరేకత బాగానే వుంది. 2014 ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థికంగా ఇంకొంచెం పోరాడివున్నా, లేక తన నోటి దురుసుతో కొందరిని దూరం చేసుకోకపోయి వున్నా ఇక్కడ గెలిచి వుండేవాడు. ఇప్పుడు కూడా ఉదయగిరికి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గట్టి అభ్యర్థే! కాకపోతే డబ్బు బాగా పెట్టాల్సి వుంటుంది. ఒకవేళ ఆ కోణంలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పక్కకు తప్పుకుంటే ఇక్కడ గౌతంరెడ్డి అయినా మంచి అభ్యర్థే అవుతాడు. కోవూరులో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బలమైన అభ్యర్థే అవుతాడు. కాకపోతే ఆర్థిక వనరుల్లో కొంత బలహీనంగా కనిపిస్తున్నాడు. (మిగతా 11వ పేజీలో)

## వీధివీధినా విధ్వంసం

• వాహనదారుల బెంబేలు!



భూగర్భ డ్రైనేజీ పేరుతో నెల్లూరులోని రోడ్లన్నింటిని ధ్వంసం చేసారు. నగరంలోని ప్రతి వీధిలోనూ సిమెంటురోడ్డు వేసి వుండడం తెలిసిందే! 1994-2004ల మధ్య తెలుగుదేశం ప్రభుత్వంలోనూ 2004-2014ల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ నగరంలో సిమెంట్‌రోడ్లు బాగానే పడ్డాయి. ముఖ్యంగా 2011-2014ల మధ్య ఆనం రామనారాయణరెడ్డి ఆర్థికమంత్రిగా వున్నప్పుడు నెల్లూరుకు భారీగానే నిధులు రావడం, పెద్దఎత్తున సిమెంటురోడ్లు వేయడం జరిగింది.

నగరంలో వందలకోట్ల ఖర్చుతో వేసిన సిమెంట్‌రోడ్లన్నింటిని ఇటీవల భూగర్భడ్రైనేజీ పైపులు వేయడం కోసం ధ్వంసం చేయడం తెలిసిందే! ప్రతి వీధిలో ప్రతి సిమెంటురోడ్డును మధ్యలో కోసి పైపువేసి తిరిగి మట్టితో పూడ్చారు. మధ్యలో కోసిన సిమెంట్‌రోడ్లను ఎక్కడా కాంక్రీట్‌తో పూడ్చలేదు. వీటన్నింటిని కాంక్రీట్‌తో సరిచేయడానికి ఇంకో సంవత్సరకాలం పట్టొచ్చు. కానీ ఈలోపు వర్షాలతో వీధులన్నీ బురదమయం అవుతున్నాయి. వర్షాలతో మట్టి కొట్టుకుపోయి సిమెంట్‌రోడ్ల మధ్యలో గోతులు ఏర్పడుతున్నాయి. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయకపోతే వాహనాలు ఈ గోతుల్లో పడే అవకాశాలున్నాయి. నిన్న మొన్న కురిసిన కొద్దిపాటి వర్షాలకే పగలగొట్టిన రోడ్ల మీద వాహనాలు తోలాలంటే భయపడుతున్నారు. రేపు భారీ వర్షాలొచ్చి రోడ్ల మీద నీళ్ళు పారుతుంటే పరిస్థితి ఇంకెలా ఉంటుందో?

## ఆర్టీసీని... ఆధునీకరించడం కాదు...

# తరలించడమే ఉత్తమం





నగరంలో ట్రాఫిక్ సమస్యకు అదే పరిష్కారం

నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్‌కు నాలుగు దశాబ్దాల పైబడిన చరిత్ర ఉంది. అప్పట్లో ఈ బస్టాండ్ నగరానికి దూరంగా ఉన్నట్లుండేది. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో నగరం నలువైపులా విస్తరించింది. దీంతో ఆర్టీసీ బస్టాండ్ నగరానికి నడిబొడ్డులో వున్నట్లయ్యింది. కొన్నేళ్ల క్రితం బస్టాండ్‌లో ప్లాట్‌ఫారాలు చాలావరకు ఖాళీగా వుండేవి. ఇప్పుడు మాత్రం ప్లాట్‌ఫారం మీద ఒక బస్సు వుంటే దానివెనుక ఇంకో రెండు బస్సులు వెయిటింగ్‌లో వుండే పరిస్థితి. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్‌లో 19ప్లాట్‌ఫారాలున్నాయి. అయితే పెరిగిన బస్సులకు ఈ ప్లాట్‌ఫారాలు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇటీవల తిరుమల బస్సులకు, నెల్లూరురూరల్ గ్రామాలకు వెళ్లే బస్సులకు ప్రత్యేక ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేశారు. అయినా కూడా బస్టాండ్ బస్సులతో, ప్రయాణీకులతో ఇరుకుగానే వుంటోంది. మొత్తం ఆర్టీసీ ప్రాంగణం 12ఎకరాలు. ఇందులోనే ఒకటి, రెండు డిపోలున్నాయి. ఒకప్పుడు విశాలంగా అనిపించిన బస్టాండ్ ఇప్పటి అవసరాలకు సరిపోవడం లేదు. బస్టాండ్‌కు వచ్చే బస్సుల సంఖ్య బాగా పెరిగింది. నైట్‌హాల్ట్ బస్సులు పెరిగాయి. కాబట్టి ఆర్టీసీ బస్టాండ్‌ను ఇక్కడ నుండి నగర శివారు ప్రాంతాలకు తరలించి దాదాపు 40ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచనను గతంలోనే 'లాయర్' ప్రస్తావించింది. దీనిమీద గతంలో జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన వాళ్లు స్పందించి ప్రతిపాదనలు కూడా తయారుచేయడం జరిగింది. అయితే గతంలో వున్న ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం మూలంగా అది ఆచరణరూపం దాల్చలేదు.

కాని, నగరంలో నగం ట్రాఫిక్ సమస్యకు కారణం ఆర్టీసీ బస్టాండే! ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగానే వేల సంఖ్యలో ఆటోలు, వందల సంఖ్యలో టౌన్ బాస్సులు నడుస్తున్నాయి. అయ్యప్పగుడి, బోసుబొమ్మల మధ్య ట్రంకురోడ్డు చాలా ఇరుకుగా మారింది. రోడ్డు మీద ఎప్పుడు చూసినా ఆటోల ర్యాలీ జరుగుతున్నట్లుగా వుంటుంది. ఆర్టీసీ బస్టాండ్‌ను ఇక్కడ నుండి మినీబైపాస్, జాతీయ రహదారిల మధ్యకు నగరానికి ఓ వైపు ఉండేలా మారిస్తే ట్రంకురోడ్డులో ట్రాఫిక్ సమస్య సగానికిపైగా తగ్గిపోతుంది.

కాని, ఇప్పుడున్న బస్టాండ్‌నే ఆధునీకరించనున్నట్లు, ఇందుకోసం 175కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లుగా కూడా తెలుస్తోంది. బస్టాండ్‌లో అదనంగా 21 ప్లాట్‌ఫారాలను నిర్మించడంతో పాటు ఆర్టీసీ ప్రాంగణంలో కళ్యాణ మండపం, కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, మినీ థియేటర్ వంటివి ఏర్పాటు చేయడం ద్వారా ఆర్టీసీ ఆదాయాన్ని పెంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పుడు 175కోట్లు పెట్టి ఆధునీకరిస్తారు, ఇంకో పదేళ్ల తర్వాతయినా మళ్ళీ ఈ బస్టాండ్ ఇరుకనిపిస్తుంది. అప్పుడేం చేయాలి. దీనిబదులు ఇప్పుడే బస్టాండ్‌ను నగర శివారుకు తరలించడం మంచిది.

మినీబైపాస్, జాతీయ రహదారికి అనుసంధానంగా మధ్యలో ప్రభుత్వానికి సంబంధించిన భూములున్నాయి. వాటిని గుర్తించి ఆర్టీసీ అక్కడకు మార్చే ప్రయత్నం చేయాలి. ప్రస్తుతమున్న ఆర్టీసీ ప్రాంగణాన్ని సంస్థ వాళ్ళు కమర్షియల్ కేంద్రంగా అభివృద్ధి చేసుకుని ఆదాయం గడించవచ్చు. ఇప్పుడున్న చోట నుండి ఆర్టీసీని తరలించడమే నగరంలో ట్రాఫిక్ సమస్యకు మంచి పరిష్కారం.



# కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం ప్రారంభం

## పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు.. ఆర్యవైశ్య ప్రముఖులు



ఆర్యవైశ్యుల ఇలవేల్పుగా నిత్య పూజలందుకునే కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమాలు ఈ నెల 16న నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఎంతో వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలను తిలకించారు. జై వాసవి!.. జైజై వాసవి అంటూ భక్తులు పెద్దపెట్టున అమ్మవారి నామస్మరణలు చేస్తుండగా, శంకుస్థాపన మహోత్సవం శాస్త్రోక్తంగా.. కన్నులపండువగా జరిగింది. నగరంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్యవైశ్య మహిళలు వాసవి ఇటుకలను ఎంతో భక్తితో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి శంకుస్థాపనకు సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కోలాటాలు, భజనలు ఆలయంలో ఆకర్షణీయంగా వుండి అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రత్యేకవేదికపై కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో బద్దేలు వాస్తవ్యులు బ్రహ్మశ్రీ కనమళ్ళ సత్యనారాయణ శర్మ, ప్రధానార్చకులు శివకుమార్‌స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారికి విశేష పూజలు, హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించగా, ఆలయ పాలకమండలి గౌరవాధ్యక్షుడు, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ దాసా సురేష్‌రాజా, సభ్యులతో కలసి శంకుస్థాపన వేదికల్లో శిలాప్రతిష్టలను పూర్తిచేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణంతో పాటు, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, పవనసుత, శ్రీ సీతా లక్ష్మణ సమేత హరిహర సుత మందిరాలు, నవగ్రహ ఆలయాలకు పాలకమండలి సభ్యులు శంకుస్థాపన చేశారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్యవైశ్యుల చరిత్రలోనే ఇదో మరపురాని రోజని అన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి నూతన పాలకమండలి వారిచ్చిన మాటకు కట్టుబడి ఇప్పుడు శంకుస్థాపన జరగడం హర్షదాయకమన్నారు. నగర ఎమ్మెల్యే డా. అనిల్ కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, శ్రీ రంగనాథస్వామి దేవస్థానం ఛైర్మన్ మంచికంటి సుధాకరరావు, శ్రీ కోదండరామస్వామి ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మన్ కొలపర్తి వెంకటరమేష్‌కుమార్ తదితరులు ఈ ఆలయ పునర్నిర్మాణ వేడుకల్లో పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## సీఎంను కలిసిన శీనయ్య



నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ నెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసారు. తన మీద నమ్మకంతో నుడా ఛైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు ఆయన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. 'నుడా' ఛైర్మన్ పదవికి ఎంతో ప్రాధాన్యత ఉందని, అందరినీ కలుపుకుని పోతూ 'నుడా' పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సీఎం శీనయ్యకు సూచించారు.

### నెల్లూరుజిల్లా క్రషర్స్ ఓనర్స్ అసోసియేషన్

## అధ్యక్షుడిగా వై.వి.రామిరెడ్డి



తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు వై.వి.రామిరెడ్డి క్వారి, క్రషర్స్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆదివారం నెల్లూరులో తొలిసారిగా క్రషర్స్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షులు వినయ్‌శేఖర్, ప్రధానకార్యదర్శి శ్రీనివాసబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ సమావేశానికి నవ్యాంధ్రప్రదేశ్‌లోని 13జిల్లాలకు చెందిన క్రషర్స్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. కీలకమైన ఈ సమావేశంలో నెల్లూరుజిల్లా క్రషర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వై.వి.రామిరెడ్డి అధ్యక్షులుగా, బి.సుబ్బారెడ్డి ప్రధానకార్యదర్శిగా, ఏ.వి.రమణయ్య కోశాధికారిగా, ఇ.రాంప్రదీప్‌రెడ్డి ఉపాధ్యక్షులుగా, పి.వెంకటరావు సహాయకార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రషర్స్ ఓనర్స్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.

### డా॥ కిషోర్స్ రత్నం ఫ్యూచర్‌విజన్ స్కూల్‌లో

## యోగాపై అవగాహన కార్యక్రమం



ఈ నెల 21న యోగా దినోత్సవం పురస్కరించుకుని నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రత్నం ఫ్యూచర్‌విజన్ స్కూల్‌లో ఈ నెల 18న 'యోగాసనాలు, వాటి ఆవస్యకత' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ సమస్యలు లేని జీవనానికి యోగా ఉత్తమ సాధనమని, శాంతి సద్భావన కోసమే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళ్యాణి, మేనేజర్ రాధాకృష్ణ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### సోమిరెడ్డి ఓఎస్డీగా

## ప్రసాదరావు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వద్ద ఓఎస్డీగా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రసాదరావు నియమితులయ్యారు. గతంలో ఈయన జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడిఏగా పనిచేస్తూ, పదోన్నతిపై చిత్తూరుజిల్లాకు డిడిఏగా బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖలో సుమారు పాతికేళ్ళ అనుభవంతో ఆయన రైతులకు ఎన్నో సేవలందించారు. ఆరుసార్లు జిల్లాస్థాయిలో ఉత్తమ అధికారిగా, రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ సహాయ సంచాలకులుగా అవార్డులందుకున్నారు కూడా. ఇప్పుడు తాజాగా డిప్యుటేషన్‌పై మంత్రి సోమిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు.

## వాకర్స్‌కు వ్యాధులపై అవగాహన



ఈ నెల 18న నెల్లూరు, ఏ.సి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు మూత్ర వ్యాధి సమస్యలు, ప్రొస్టేట్ గ్రంధి పరిస్థితులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రముఖ యూరాలజీ వైద్యనిపుణులు డాక్టర్ వేదమూర్తిరెడ్డి మూత్ర వ్యాధులు, కిడ్నీలలో రాళ్లు వంటి సమస్యలపై కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వినుకొండ వెంటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి డి.జయరామయ్యనాయుడు, కోశాధికారి పి.రాజారావు, జాయింట్ సెక్రటరీ ఎన్.సాయిసుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 డిప్యూటీ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, సభ్యులు పిచ్చయ్య, బి.లక్ష్మీనారాయణ, ఎల్.శ్రీనివాసులు, జి.వి.కృష్ణయ్య, షేక్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## చిరుజల్లులతో పులకింత

అదరగొసిన ఎండలతో బెదిరిపోయిన జనానికి ఇప్పుడు కురుస్తున్న జల్లులతో ఉపశమనం లభించింది. ఇటీవల ప్రతి రోజూ ఏదో ఒక టైంలో కొద్దిపాటి వర్షం కురుస్తూనే వుంది. ఎండలు తగ్గి వాతావరణం చల్లబడడంతో జనం ఊపిరి పీల్చుకుంటున్నారు.

## 28న సాంస్కృతిక పోటీలు

కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 9గంటల నుండి సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు కేతా సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సినీ పాటలు, నృత్యాలు, ఫ్లూట్, డోలక్, తబల, చిత్రలేఖనం, విచిత్ర వేషధారణ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే కళాకారులు 7842358021 సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

## రైతుల సమస్యలు పరిష్కరించండి

### - డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు విఆర్‌సి సెంటర్ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అన్నదాతలకు బ్యాంకులు రుణాలివ్వడం లేదని, రుణమాఫీ జరగకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి జేసీ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషారెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రఘురామ్ ముదిరాజ్, జి.శివాచారి పాల్గొన్నారు.

## రావి ఆకుపై సోమిరెడ్డి సూక్ష్మచిత్రం



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూక్ష్మ చిత్రాన్ని నెల్లూరుజిల్లా ముత్తుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సోమా పద్మారత్నం రావి ఆకుపై చిత్రీకరించారు. ఆదివారం జరిగిన ఓ సమావేశంలో పద్మారత్నం ఈ సూక్ష్మ చిత్రంతో పాటు సోమిరెడ్డిపై రాసిన కవితను ఆయనకు అందజేశారు.

## విద్యార్థి నాయకులా?...

# వీధి రౌడీలా?

- బంద్‌ల పేరుతో ఇబ్బందులు
- సమస్యలపై కంటే సంపాదనపైనే ఆరాటం
- స్వార్థప్రయోజనాలకే పోరాటం



బంద్‌ను వ్యతిరేకిస్తూ సమావేశమైన ప్రైవేట్ స్కూల్స్ యాజమానులు

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యార్థి నాయకుడి నుండి ప్రధాని స్థాయికి ఎదిగిన వ్యక్తులున్నారు. విద్యార్థి సంఘాల నేతలుగా చిత్తశుద్ధితో పనిచేసి ఈరోజు చాలామంది గొప్ప నాయకులనిపించు కుంటున్నారు. విద్యార్థి సంఘాల నాయకులకు క్రమశిక్షణ చాలా అవసరం. పదిమందికి స్ఫూర్తినిచ్చే విధంగా వారి పోరాటాలుండాలి. విద్యార్థుల సమస్యలపై, మారుతున్న విద్యా విధానాలపై వారు పోరాడాలి.

అయితే ఇటీవలకాలంలో విద్యార్థి సంఘాల ముసుగులో కొందరు అరాచకాలకు దిగుతున్నారు. రౌడీల్లాగా ప్రవర్తిస్తున్నారు. దందాలు చేస్తున్నారు. రౌడీ మామూళ్ళు దండుకుంటున్నారు. ఎంతో నిబద్ధతగా పనిచేస్తాయనే పేరున్న ఆయా విద్యార్థి సంఘాల పేరునే వీళ్ళు చెడగొడుతున్నారు. విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకుంటే అధికారులు భయపడతారు. పాఠశాలలు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు భయపడతాయనే దమ్ము ధైర్యంతో వీళ్ళు విద్యార్థి సంఘాల నాయకుల ముసుగులు తగిలించుకుంటూ, దౌర్జన్యాలకు దిగుతున్నారు. గతంలో కూడా నెల్లూరులో పలువురు విద్యార్థి సంఘాల నాయకులపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలకు మరింత ఊతం ఇస్తూ తాజాగా 19వ తేదీ నెల్లూరు, చంద్రమౌళినగర్‌లోని మైథిలి స్కూల్‌లో ఓ సంఘటన చోటుచేసుకుంది.

ప్రతి ఏడాది జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమైన నెలలోనే ఒక్కో విద్యార్థి సంఘం ఒక్కోరోజు విద్యార్థుల సమస్యలపై పోరాటమంటూ బంద్‌కు పిలుపునిస్తుంటాయి. ఆయా విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చిన రోజున విద్యాసంస్థలను యాజమాన్యాలు మూసేస్తుంటాయి. అయితే ఇలా జరిగిన బంద్‌ల మూలంగా ప్రభుత్వం దిగొచ్చి ఒక్క సమస్యను కూడా పరిష్కరించిన దాఖలాలు లేవు. కాకపోతే విద్యార్థి సంఘాలు తమ ఉనికిని చాటుకోవడానికి ఇలా బంద్‌ల పేరుతో పోరాటాలు చేస్తుంటాయి.

ఈ ఏడాది కూడా మొన్ననే 12వ తేదీ పాఠశాలలు తిరిగి తెరచుకున్నాయి. స్కూళ్ళు తెరిచాక క్లాస్‌లు జరగడానికి, విద్యార్థులు గాడిలో పడడానికి వారం, పదిరోజులన్నా పడుతుంది. ఈలోపే బంద్ అంటే స్కూల్ యాజమాన్యాలకైనా, విద్యార్థులకైనా ఇబ్బందే! కాని స్కూల్స్ తెరిచి వారం కూడా కాకముందే 19వ తేదీ విద్యార్థి జేఏసీ పేరుతో కొందరు విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకుంటూ బంద్‌కు పిలుపునిచ్చారు. అయితే ఈ బంద్‌ను నెల్లూరులోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యతిరేకించాయి. విద్యా సంవత్సరం ఆరంభంలోనే బందుల్లాంటి అపశకునాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతాయని, బంద్‌ను మరోరోజు పెట్టుకుంటే తాము సహకరిస్తామని ప్రైవేట్ పాఠశాలల యజమానులు విద్యార్థి నాయకులకు తెలిపారు. అయితే విద్యార్థి జేఏసీ పేరుతో బంద్‌కు పిలుపునిచ్చిన వాళ్ళు, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల మాటను ఖాతరు చేయకుండా 19వ తేదీ బంద్ పాటించారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు ఆరోజు యథావిధిగా స్కూళ్ళు తెరిచారు. ఇది సహించలేని విద్యార్థి జేఏసీ నాయకులు కొందరు చంద్రమౌళినగర్‌లోని మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్దకు వెళ్లారు. మీరు స్కూల్ మూసేస్తే, మిగతా స్కూల్స్ వాళ్లు కూడా మూసేస్తారని, కాబట్టి మూసేయాల్సిందేనని ఆస్కూల్ కరస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డితో వాదనకు దిగారు. ఈరోజు స్కూల్స్‌ను తెరవాలన్నది స్కూల్ యజమానులందరం కలిసి తీసుకున్న నిర్ణయమని, కాబట్టి నేను మూసేయనని ఆయన ఖరాఖండీగా చెప్పాడు. దీంతో అక్కడ విద్యార్థి జేఏసీ నాయకులమని చెప్పుకునేవాళ్ళు గొడవ సృష్టించారు. తమ చొక్కాలు తామే చించుకుని స్కూల్ యాజమాన్యమే తమపై దాడిచేసినట్లు డ్రామాలాడారు. వాళ్ల స్కూల్‌లో గలభాచేసి ఆ స్కూల్ కరస్పాండెంట్ మీదే తమపై దౌర్జన్యం చేసాడని కేసు పెట్టారు.

ఈ మధ్యకాలంలో విద్యార్థి సంఘాల ముసుగులో కొందరు చేస్తున్న ఆగడాలు జుగుప్స కలిగిస్తున్నాయి. ఎస్ఎఫ్ఐ, ఏబివిపి, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, టిఎన్ఎస్ఎఫ్ వంటి విద్యార్థి సంఘాల నుండి ఎంతోమంది మంచి నాయకులు తయారయ్యారు. వాళ్ళు సమస్యల మీద పోరాడారు. అలాంటి సంఘాల పేరు ప్రతిష్టలను దిగజార్చేలా కొందరు జేఏసీల పేరుతో దందాలు సాగిస్తున్నారు. ఇలాంటి వారి ఆగడాలకు విద్యార్థి సంఘాల నాయకులే అడ్డుకట్ట వేయాలి.

### జేఏసి కన్వీనర్‌పై చర్యలు తీసుకోవాలి

ఏపి ప్రత్యేకహోదా విద్యార్థి జేఏసి కన్వీనర్ పేరుతో మూడేళ్ళుగా ప్రతి పాఠశాలకు వెళ్లి దౌర్జన్యం చేసి నగదు వసూళ్ళకు పాల్పడుతున్న అంజయ్యపై చర్యలు తీసుకోవాలని నెల్లూరుజిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు మనోహర్‌రెడ్డి, చాట్ల నరశింహారావు, ప్రతాపరెడ్డి, అన్వర్‌బాషా, ఎం.వి.సుబ్బారెడ్డిలు సుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీని ఒక ప్రకటనలో కోరారు.

# అధ్వాన్నంగా సర్కార్ బళ్ళు

### - ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్



మున్సిపల్ పాఠశాలలు అధ్వాన్నస్థితిలో ఉంటున్నాయని నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేసారు. ఈ నెల 20వ తేదీన ఆయన వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ హైస్కూల్‌లో 800మంది విద్యార్థులుంటే 6గదులే వున్నాయని, 15మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, ప్రభుత్వం వెంటనే అదనపు గదులను మంజూరు చేయడంతో పాటు అదనంగా మరో 10మంది ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ హైస్కూలులో లైబ్రరీ, ల్యాబ్‌లకు రూములు లేవని, మరుగుదొడ్లు లేవని, ప్రభుత్వం ప్రకటనల కోసం ఖర్చుపెట్టే కోట్ల రూపాయలను వీటికి కేటాయిస్తే సమస్యలన్నీ తీరుతాయన్నారు. మంత్రులు, కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు దాతల సహకారంతో ఈ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్చేందుకు కృషి చేస్తానని అనిల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ అశోక్, ఓబిలి రవిచంద్ర, వైసిపి నాయకులు బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వర్లు, ఆర్.జేస్సీ, పి.ప్రసాద్, సుభాషిణి, సంక్రాంతి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో...

# పత్రికల పాత్ర ఎంతో కీలకం



ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 18వ తేదీ నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రజాశక్తి ఆధ్వర్యంలో జరిగిన మోటూరు హనుమంతరావు 16వ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో సోమిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజాస్వామ్య మనుగడ పత్రికలు పోషించే భూమికపైనే ఆధారపడి వుందన్నారు. తన రాజకీయ జీవితం ఎదుగుదలకు ప్రధానంగా జర్నలిస్టులు, పత్రికలే కారణమన్నారు. సారా వ్యతిరేక ఉద్యమంలో, థర్మల్ స్టేషన్ల కాలుష్య వ్యతిరేక పోరాటాల్లో తాను ఎన్నో పర్యాయాలు వామపక్షాలతో కలిసి పనిచేసినప్పుడు తనకు జర్నలిస్టు మిత్రులు ఎంతగానో సహకరించి ప్రోత్సహించారన్నారు. ప్రభుత్వాలు, సమాజంలో జరిగే తప్పొప్పులను ఎత్తిచూపేది ఒక్క పత్రికలేనని, పత్రికలు లేకపోతే సమాజంలో శూన్యం ఏర్పడే ప్రమాదముందన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిజంలో ఉన్నది ఉన్నట్లుగా రాసేవాళ్ళే నిజమైన సమాజసేవకులన్నారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పత్రికా రంగంలో పలు రకాల పెడధోరణులు వస్తున్నాయని, ఇది సమాజానికి చాలా ప్రమాదకరమన్నారు.

ఈ సందర్భంగా విశాఖమన్యంలో మంచినీటి సమస్యలపై మానవీయ కథనం రాసిన విశాఖపట్నం విశాలాంధ్ర పత్రిక ఇన్‌ఛార్జి రామకృష్ణకు మోటూరు హనుమంత రావు స్మారక జర్నలిస్టు అవార్డును ప్రదానం చేశారు. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సిపిఎం నాయకులు చంద్ర రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే పాతూరు రామయ్య, వామపక్షాల నేతలు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## నేలటూరువాసులకు

# సివిఆర్ జ్యోతులు



ఈ నెల 20వ తేదీన కృష్ణపట్నం పోర్టు సివిఆర్ జ్యోతి పథకంలో భాగంగా ముత్తుకూరు మండలం నేలటూరులోని 150మంది మత్స్యకార కుటుంబాల వారికి ఉచితంగా గ్యాస్‌స్టౌలను అందించారు. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, వాతావరణ మార్పు శాఖ అధికారులు దీపక్ శ్యామ్యూల్, భూమత్ సింగ్, రాబిన్, పన్నీరు సెల్వం, హరికృష్ణ ప్రసాద్, విశ్వనాథ్, హరిహరన్, కార్తీక్, కృష్ణపట్నం సిఇఓ సుబ్బారావు, పోర్టు పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్, ఇహెచ్ఎస్ అధికారి వేణుగోపాలరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కృష్ణపట్నం పోర్టు వారు సివిఆర్ జ్యోతి పథకంలో భాగంగా ముత్తుకూరు మండలంలోని తీరప్రాంతవాసులకు ఉచితంగా గ్యాస్ స్టౌలు అందిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో 1500స్టౌలను అందించారు. మత్స్యకారులు వంటచెరుకు కోసం చెట్లను కొట్టకుండా వాటిని కాపాడేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్న తీరును అధికారులు అభినందించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




# ప్రజల కోసమే.. మోడీ ఫెస్ట్

## - కేంద్రమంత్రి సదానందగౌడ

ప్రధాని నరేంద్రమోడీ ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అనేక పథకాలను ప్రజలకు తెలియజేసి, వాటిని ప్రజల చెంతకు చేరువ చేయాలనే ఉద్దేశ్యంతోనే మోడీ ఫెస్ట్ కార్యక్రమం చేపట్టామని కేంద్రమంత్రి సదానందగౌడ అన్నారు. నెల్లూరులోని విఆర్‌సి గ్రౌండ్‌లో ఈ నెల 16న ఆ మేరకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని, ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోడీ ఈ మూడేళ్లలో దేశప్రజలకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకమైన, నీతివంతమైన పాలనను అందిస్తున్నారన్నారు. పేదలందరికీ బ్యాంక్ ఖాతాలను కల్పించేందుకు జన్‌ధన్ ఖాతాలను ప్రవేశపెట్టారన్నారు. దేశంలో 68 కోట్లమంది ఈ ఖాతాలను ప్రారంభించారన్నారు. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశపెడుతున్న ఘనత మోడీదేనన్నారు. అనంతరం ఆయన ఇక్కడ ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి చిన్నారులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, కాకు విజయలక్ష్మి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, అబ్దుల్ రహీం, తేలపల్లి రాఘవయ్య, రమణప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఆయన నగరంలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయాన్ని, జయభారత్ ఆసుపత్రిని సందర్శించారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

## - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి

రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తూ వారి సంక్షేమమే ప్రధానధ్యేయంగా పని చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 18వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో మంత్రి సోమిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ముస్లిం సోదరుడికి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం రూ.820 కోట్లను కేటాయించిన విషయం మైనార్టీ సోదరులు గుర్తించుకోవాల్సిన అవసరముందన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వ గిరిపుత్రిక పథకాన్ని అమలు చేస్తున్నదని, ఈ పథకంలో 18 సంవత్సరాలు నిండిన తరువాత పెళ్లి చేసుకునే ప్రతి గిరిజన యువతికి వివాహ సమయంలో ప్రభుత్వం నేరుగా ఆ యువతి బ్యాంక్ అకౌంట్‌కు రూ.50వేలు జమ చేస్తుందని, అదేవిధంగా ముస్లిం మైనార్టీ పేదయువతులకు వివాహ సమయంలో వారి అకౌంట్లలో రూ.50వేలు జమ




చేయడం ఆ సమాజంపై ముఖ్యమంత్రికున్న ప్రత్యేక అభిమానాన్ని రుజువు చేస్తుందన్నారు. నెల్లూరు చెరువు సుందరీకరణకు రూ.30కోట్లు, బారాషాహిద్ దర్గా అభివృద్ధికి రూ.20కోట్లు ఇప్పటికే మంజూరు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ ప్రతి మతం చెప్పే నీతి ఒక్కటేనని, అనవసరంగా కొంతమంది మతాల పేరుతో విషప్రచారం చేస్తుంటారని, అలాంటి వాటిని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభజన, ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికీ మైనార్టీలపై ప్రభుత్వానికి వున్న ప్రత్యేక అభిమానంతో వారి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్‌లకు గౌరవ వేతనం ఇస్తూ వారు ఆత్మగౌరవంతో బతికేలా చేయూతనిస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నెల్లూరు నగరంలో నిర్మించనున్న షాదీమంజిల్‌కు సంబంధించిన సరికొత్త డిజైన్‌తో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంత్రి, కలెక్టర్, మేయర్ ఆవిష్కరించారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్ రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం

## - ఎమ్మెల్యే సునీల్


రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణ సమీపంలో గాంధీనగర్ వద్ద ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 5,103 ఇళ్ల నిర్మాణానికి ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ఆర్డీవో అరుణ్‌బాబుతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. ముందుగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే, ఆర్డీవోతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పేదవారికి ఇల్లు లేక బాధపడుతున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదవారి కల నెరవేర్చేందుకు ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేస్తారని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో, ఛైర్‌పర్సన్ తదితరులు

## గూడూరు డివిజన్ వార్తలు

ఈ కార్యక్రమంలో పుర పాలక కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, పట్టణ తెలుగు దేశం పార్టీ నాయకులు పులిమి శ్రీనివాసులు, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, బాలిబోయిన రమేష్, ఎంబేటి చంద్రయ్య, మురళీకృష్ణ, ఇస్రాయిల్‌కుమార్, పిల్లెల శ్రీదేవి, కల్పన, విజయమ్మ, మస్తానమ్మ, సుబ్బమ్మ, విజయమ్మ, ఆష్మా, రాజేశ్వరమ్మ, నూర్‌జహాన్, షంషీర్, భారతి, సిఐ సుబ్బారావు, ఎస్సై బాబి తదితరులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణకు మారుపేరు...

# సీనియర్ న్యాయవాది యరగుడిపాటి రామారావు

సీనియర్ న్యాయవాది యరగుడిపాటి రామారావు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని న్యాయమూర్తి రామకృష్ణ అన్నారు. గూడూరు న్యాయస్థాన ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం రామారావు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యరగుడిపాటి రామారావు సీనియర్ న్యాయవాది వై.చలపతిరావు తండ్రి గారని, వారి కుటుంబం న్యాయవాద వృత్తిలో ఉందన్నారు. రామారావు న్యాయవాదిగా 67ఏళ్లు పనిచేసారని తెలిపారు. ఆయన రచించిన గ్రంథాలు నేటితరం న్యాయవాదులకు మార్గదర్శకమని చెప్పారు. 1927లో పుట్టి 1949 నుండి అంకితభావంతో న్యాయవాద వృత్తిలో నైతిక విలువలతో క్రమశిక్షణకు, నిజాయితీకి మారుపేరుగా నిలిచారన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల మన్ననలను పొందారు. 4 తరాలుగా వారి కుటుంబం న్యాయవాది వృత్తిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు గోపికృష్ణ, ప్రభాకర్‌రావు, హరిప్రసాద్‌రావు, రఘురామిరెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెల్లూరు నగర మేయర్ అజీజ్

## మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

రాష్ట్రంలో ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా మైనార్టీల సంక్షేమం కోసం తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం చంద్రబాబునాయుడు మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. 18వతేదీ గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు పదో తరగతిలో అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను, రంజాన్ మాసం పురస్కరించుకుని పేదలకు దుస్తులను ఎమ్మెల్యే, నెల్లూరునగర మేయర్ అబ్దుల్ అజీజ్, పురపాలక అధ్యక్షురాలు పొనకా దేవసేన కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. ముస్లిం సోదరుల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తానని తెలిపారు. 5వ వార్డులోని దర్గా అభివృద్ధికి రూ.10లక్షలు ఎమ్మెల్యే గ్రాంటు నిధులు అందిస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎందరో నేడు ఉన్నత స్థానాలకు ఎదిగారని, కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, షంషీర్, నూర్జహాన్, ఆ సంస్థ గౌరవాధ్యక్షులు రియాజ్ అహ్మద్, ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాలవ్యానగర్ డ్రైనేజీ కాలువలో వ్యర్థాలు

- దోమలతో బాధపడుతున్న ప్రజలు

గూడూరు పట్టణంలోని మాలవ్యానగర్ వద్ద డ్రైనేజీ కాలువలో వ్యర్థాలు పేరుకొనిపోయాయి. మురికినీటి నిల్వలతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. చాలాకాలం నుంచి సిబ్బంది రాక వ్యర్థాలు పేరుకొనిపోయి ప్రజలు దుర్వాసనతో తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి కాలువలోని చెత్తా చెదారాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

సోదర వర్గానికి మేలు జరుగుతుంది. ఉద్యోగులకు పని భారం ఉంటుంది. అధికారులకు స్థానమార్పులు, నిరుద్యోగులకు అవకాశాలు బాగుంటాయి. శుభవార్తలు వింటారు. విదేశీయానానికి అవకాశాలు, కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాల ప్రయత్నాలు జరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. తొందరపాటు నిర్ణయాలు, ప్రవర్తన తగ్గించుకొనండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దూరప్రయాణాలు నిర్ణయం కాగలవు. తగాదాలు, విభేదాలు సర్దుబాటు కాగలవు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగులకు ప్రమోషన్లు పనిభారం ఉంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. వృత్తి ఉపాధి పథకాలు సంతృప్తిని ఇవ్వగలవు. కొత్త పెట్టుబడులకు వ్యాపార విస్తరణకు అవకాశాలుంటాయి. ఆదాయం పెరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆరోగ్యం విషయంలోనూ, ముఖ్యపత్రాలు, విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగులు తమ పైఅధికారులతోనూ పబ్లిక్‌తోనూ జాగ్రత్తగా వ్యవహరించవలెను. అనుకున్న ప్రయాణాలు రద్దు కావచ్చును. చేసే పనులకు ఆటంకాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, సహకారం ఆలస్యం కాగలదు. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో అనుకూలించగలవు.



# బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 23.6.2017 నుండి**
**తేది. 29.6.2017 వరకు**

ఈ వారం మేషంలో కేతువు, వృషభ మిధున కర్కాటక సింహ రాశులలో చంద్రుడు, మిధునంలో రవి కుజ బుధులు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 25 ఆషాఢ మాసం ప్రారంభము.
ముహూర్తములు లేవు.

### జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | చతుర్దశి | ఉ॥ గం.11.24వ॥ |
| తేది. 24 | శని | అమావాస్య | ఉ॥ గం.8.53వ॥ |

### ఆషాఢ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | ఆది | పాడ్యమి | ఉ॥ గం.6.30వ॥ |
| | పిదప | విదియ | రా॥ గం.4.20వ॥ |
| తేది. 26 | సోమ | తదియ | రా॥ గం.2.21వ॥ |
| తేది. 27 | మంగళ | చతుర్ధి | రా॥ గం.12.40వ॥ |
| తేది. 28 | బుధ | పంచమి | రా॥ గం.11.20వ॥ |
| తేది. 29 | గురు | షష్ఠి | రా॥ గం.10.26వ॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. శుభకార్య ప్రయత్నాలు ఫలించే అవకాశమున్నది. విద్యార్థులు కొత్త నేర్పులందు ఇముడుతారు. ఉద్యోగులకు పని భారం స్థాన మార్పులుంటాయి. మీ సొంత విషయాలలో ఇతరులను తల దూర్చనీయకండి. అదనపు ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు ఒక మోస్తరుగా జరిగి ఆదాయం కూడా అట్టే ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

విదేశ ప్రయాణాలు దూర ప్రాంతాలకు ప్రయాణాలు నిర్ణయం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. పని భారం ఉండి ఉద్యోగులు సమర్ధతను ప్రదర్శిస్తారు. సేవా కార్యక్రమాలు, దైవ కార్యాలలో పాల్గొనడం, పెట్టుబడులకు అవకాశాలుండడం, శారీరక ఆరోగ్య బాధలుంటాయి. కుటుంబంలో భిన్నాభిప్రాయాలు రాకుండా చూచుకొనాలి. ఆదాయం సామాన్యం.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యవహారాలను సొంతంగా జరపండి, మధ్య దళారులు వద్దు. రావలసిన బాకీలు కొంతమేరకు అందుతాయి. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. యజమానులకు వర్కర్లతో చిన్న ఇబ్బందులుంటాయి. ఖర్చులు అదనంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం ఉంటుంది. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆరోగ్య విషయంలో జాగ్రత్తపడాలి. అధికారులకు ఉద్యోగులకు పని వత్తిడి ఎక్కువగా ఉంటుంది. శాస్త్ర సాంకేతిక క్రీడా కళారంగాల వారికి అవకాశాలు అభివృద్ధి బాగుంటుంది. చెల్లింపులు సకాలంలో చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడతాయి. ముఖ్యులను కలుసుకొనలేకపోవచ్చును. చేపట్టిన పనులకు ఆటంకాలు కలిగి ఇబ్బంది పెడతాయి. ఇతరులకు సహాయం చేస్తారు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. దూర ప్రయాణాలుంటాయి. కుటుంబంలో చిన్న చిన్న ఇబ్బందులుంటాయి సర్దుకొని పోవాలి. చెల్లింపులు ఖర్చులు అధికంగా ఉంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో కొద్దిపాటి అవకాశాలుంటాయి. బంధుమిత్రుల రాకపోకలుంటాయి. ఆర్ధికంగా మందకొడి పరిస్థితులుంటాయి. ఆదాయం, వ్యాపారావకాశాలు తగ్గుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేపట్టిన పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్‌గా ఉంటుంది. ఉద్యోగార్ధులకు అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు అధికారులకు పనుల వత్తిడి పెరిగినా సమర్ధత గుర్తింపు బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. బంధుమిత్రులతో స్వల్ప విభేదాలుంటాయి. ఉన్నత విద్యావృద్ధిలో కృషి ప్రారంభిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. షేర్ల మీద లాభాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అప్పుడప్పుడు టెన్షన్ ఉంటుంది. ఇతరులకు సహాయపడడం, ఇతరుల పనులపై ప్రయాణాలు జరపడం ఉంటుంది. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. విద్యార్థులకు కలిసివచ్చే కాలం. బంధువుల రాకపోకలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు అప్రయత్నంగానే సాగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగులకు స్థానమార్పు, ఉన్నతి ఉంటుంది. నలుగుతున్న సమస్యల నుండి బయటపడతారు. మీ సలహాలు సహకారం ఇతరులకు ఉపయోగపడతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. సొంత పనులపై ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. అనుకోని అదనపు ఆదాయం స్వల్పంగా ఉంటుంది. ఆదాయానికి తగినట్లుగా ఖర్చులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొత్త ప్రాంతాలను సందర్శిస్తారు. బంధుమిత్రులకు సహాయ సహకారాలు అందించగలరు. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి రాగలవు. కొత్త పెట్టుబడులు, క్రయ విక్రయాలను ఆపుకొనడం మంచిది. బంధువుల రాకపోకలుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. బిడ్డల విద్యా, శుభకార్యాలపై దృష్టి పెట్టి కృషి చేస్తారు.

# 'దేశం'లో శాంతిదూతలు

శ్రీను గల్పిక

తన కలల రాజధాని అమరావతిలోని సచివాలయం నుండి ఉండవల్లిలోని తన ఇంటికి అప్పుడే చేరుకున్నాడు హైటెక్‌రత్న, నవ్యాంధ్ర సీఎం చంద్రబాబునాయుడు. చంద్రబాబు హాల్‌లోకి రాగానే మనుమడు దేవాన్ష్ బుడిబుడి అడుగులు వేసుకుంటూ వచ్చి తన తాత చేతికి టీవీ రిమోట్ అందించాడు. చంద్రబాబు టీవీ ఆన్ చేసి తనకు పెద్దగా ఇష్టంలేని ఏబిసిడి న్యూస్‌ఛానెల్ పెట్టాడు. అందులో ఎంపీ టీజీ వెంకటేష్, కేంద్రమంత్రి సుజనాచౌదరి, రాష్ట్రమంత్రి పత్తిపాటి పుల్లారావులు మీడియాతో మాట్లాడుతున్న దృశ్యాలు వస్తున్నాయి. మొదట టి.జి. మాట్లాడుతూ మా నాయకుడు చంద్రబాబు గారు దేశానికి ఎంతో సేవచేశారు. దేశం అంటే తెలుగుదేశం అనుకునేరు, భారతదేశం కన్నమాట... ఆయన సేవలను దృష్టిలో పెట్టుకుని ఆయ నను రాష్ట్రపతిని చేయాలి, అలాగే లోకేష్‌ను ఇంకో క్షణం కూడా ఆలస్యం చేయకుండా ముఖ్యమంత్రిని చెయ్యాలి అని చెప్పాడు. తర్వాత సుజనారాం మాట్లాడుతూ... చంద్రబాబును రాష్ట్రపతి, లోకేష్‌ను సీఎంగా చేయడంతో పాటు దేవాన్ష్‌ను కూడా మంత్రి వర్గంలోకి తీసుకోవాలి, మంత్రి కావడానికి దేవాన్ష్‌కు అన్ని అర్హతలున్నాయని చెప్పాడు. పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ... మా చంద్రబాబు గాంధీమహాత్ముడంతటివాడు. కాకపోతే ఆయన గోచీ పెట్టుకుంటాడు, ఈయన ఫ్యాంటు, షర్టు, లోపల బనియన్ వేసుకుంటాడు... అంతే తేడా అని చెప్పాడు. పత్తిపాటి తనను గాంధీతో పోల్చే సరికి చంద్రబాబుకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాళ్ల మాటలకు కడుపు నిండిపోవడంతో పుల్కాలు తినకుండా తన బెడ్‌రూంలోకి వెళ్లి గోడకు వేలాడదీసివున్న గాంధీఫోటోను చూస్తూ... ఓ శాంతిదూత... నాలాగే మా పార్టీ నాయకులు కూడా మీ ఆశయాలను పాటించేలా ఆశీర్వదించండి స్వామి అని మనసులో వేడుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

అది దెందులూరు నియోజకవర్గంలోని కృష్ణానది ఇసుక రీచ్ ప్రాంతం. అక్కడ ఎమ్మార్వో వనజాక్షి అక్రమ ఇసుక ట్రాక్టర్లను ఆపేసింది. ట్రాక్టర్ల యజమానులు ఆమెతో గొడవ పడుతున్నారు. అప్పుడే అక్కడకు కాళ్లకు చెప్పులు లేకుండా కాలినడకన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వచ్చాడు. ఎమ్మార్వో వనజాక్షితో గొడవ పడుతున్న తన అనుచరులను... నాయనా, మహిళలను గౌరవించండి, వారి పట్ల మర్యాదగా ప్రవర్తించండి, వారిని దూషించడం తగదు అని హితబోధ చేసాడు. కాని, వారిలో ఓ వ్యక్తి... బోచెప్పొచ్చావులే పోవయ్యా... నీ బోడి శాంతి సందేశాలు వినడానికి మేమిక్కడ గాజులు తొడుక్కుని లేం. నీ కబుర్లు చెవులు తెగినోళ్లకు చెప్పుకోపో అని కసిరాడు. అయినా చింతమనేని ప్రభాకర్‌లో ఎటువంటి కోపమూ రాలేదు. బాబూ నువ్వు ఆవేశంలో ఉన్నావు. ఆవేశం అన్నింటికి పరిష్కారం కాదు, మనసును నిజాయితీగా ఉంచుకో, అహింసను మించిన ఆయుధం లేదు, ఆ మహిళా అధికారిణికి క్షమాపణలు చెప్పి మీ దారిన మీరు వెళ్లండి, అహింసా పరమోధర్మః అని చింతమనేని అన్నాడు. వెంటనే ఇంకో వ్యక్తి... ముందు నువ్వు పక్కకు జరుగు అంటూ చింతమనేని చేయి పట్టుకుని లాగాడు. వెంటనే చింతమనేని... నాయనా, ఒక చెంపన కొడితే రెండో చెంప చూపించమని మా గురువు బాపూజీ గారు చెప్పారు. ఇప్పుడు మీరు నా కుడి చెంపను కొట్టారు, ఇదిగో ఎడమ చెంప... దీనిని కూడా కొట్టండి... కాని మీరందరూ హింసోన్మాదాన్ని వదిలేసి అహింసాయుత మార్గంలో నడవండి... జై బాపూజీ అంటూ అక్కడ నుండి వెళ్లిపోయాడు.

★★★★★

విజయవాడలోని రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం. ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నలు అక్కడకు వచ్చారు. ముగ్గురు చేతుల్లోనూ గులాబీ పూలున్నాయి. ముగ్గురూ ఆ గులాబీ పూలను కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంకు ఇచ్చారు. ఏంటివి, నాకెందుకిస్తున్నారని ఆయన అడిగాడు. నాని వుండి... సార్, 'శంకర్ దాదా జిందాబాద్' సినిమా చూడలేదా? అధికారులు సక్రమంగా పనిచేయనప్పుడు నిరసన తెలిపే పద్ధతి. మేమేదో కడుపు నింపుకోవడానికి నాలుగు బస్సులను ఎంతో నిజాయితీగా, నిబంధనలకు అనుగుణంగా నడుపుకుంటున్నాం. మాకు తెలిసిందల్లా ప్రేమ, అహింసా, భూతదయ. మేం నూరణాల గాంధీజీ ఫాలోయర్స్‌మి. మీ డిపార్ట్‌మెంట్ వాళ్ళు లంచాల కోసం మా బస్సులను ఆపేస్తున్నారట. అది పద్ధతికాదు సార్, నిజాయితీగా ఉండమనండి, సంపాదించిన దాంట్లోనే సర్దుకుని తినండి అని హితబోధ చేశాడు. అక్కడవున్న ఓ బ్రేక్ ఇన్స్‌పెక్టర్... మీరు చెప్పే సొల్లు కబుర్లు వినడానికి మేం ఖాళీగా లేం... ముందు బయటకెళ్లండి అంటూ ఆవేశంగా అరిచాడు. బోండా వుండి... సార్, అంత ఆవేశమెందుకు సార్, దేశానికి స్వాతంత్ర్యం ఆవేశం వల్ల రాలేదు సార్, అహింసాయుత ఉద్యమం వల్ల వచ్చింది. అతిగా ఆశపడే మగాడు, అతిగా ఆవేశపడే ఆడది బాగుపడినట్లు చరిత్రలో లేదని 'నరసింహ' సినిమాలో రజనీకాంత్ చెప్పాడు... చూల్లేదా? రోజూ ధ్యానం, యోగా చేయండి, మనసులను ప్రశాంతంగా ఉంచుకోండి అని చెప్పాడు. బుద్దా వెంకన్న అందుకుని... ప్రశాంతంగా జీవించడంలో వున్న సుఖం ఇంకెందులోనూ లేదు, మాకు గొడవలన్నా, వివాదాలన్నా పడవు, కాబట్టి మేం మా సమస్య చెప్పు కున్నాం, శాంతియుతంగా వెళ్ళిపోతున్నాం అంటూ వెనుదిరిగారు.

★★★★★

విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్. అప్పుడే ఓ కారొచ్చి ఆగింది. శాంతి స్వరూప్ బిరుదాంకితుడు, ఎంపి జేసీ దివాకర్‌రెడ్డి దిగాడు. నేరుగా ఇండిగో విమాన సంస్థ కౌంటర్ వద్దకు వెళ్లి సెల్‌ఫోన్‌లో తన టికెట్ బుకింగ్ మెసేజ్ చూపించి బోర్డింగ్ పాస్ అడిగాడు. అక్కడున్న సిబ్బంది... సారీ సార్, టైం అయిపోయింది. అయినా, ఇంత లేటుగా వచ్చారేమిటి అని అడిగారు. జేసీ తల పట్టుకుని... అయ్యో, ఈ చైనా వాచీని నమ్ముకుని ఎంత తప్పు చేసాననుకుంటూ... వారితో... సారీ తమ్ముడు... నిన్న నా ఫ్రెండ్ చైనా నుండి వస్తూ ఈ చేతి గడియారం తెచ్చాడు. దీంట్లో చైనా టైమే వుంది... నేను దీనిని నమ్ముకుని లేటుగా వచ్చాను. ఏం చేస్తాం, రోడ్డు గుండా వెళ్లిపోతాలే అని అన్నాడు. అందుకు అక్కడున్న సిబ్బంది... సారీ, మీరు పార్లమెంటు సభ్యులు... ఎంపీలలో మీ అంత శాంతి స్వభావులను ఇంకెక్కడా చూడలేదు, మీ కోసం కంపెనీ అధికారులతో మాట్లాడి విమానాన్ని అరగంట ఆపించే ప్రయత్నం చేస్తామన్నారు. అప్పుడు జేసీ వారి చేతులు పట్టుకుని... వద్దు తమ్ముడు, నా ఒక్కడి కోసం వందలమంది ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం నాకిష్టముండదు. నేను లేట్‌గా వచ్చి తప్పు చేసాను, తప్పుకు ప్రాయశ్చితం అనుభవించాల్సిందేనని మా గురువు గారు చెప్పారు. నేను తప్పు చేస్తే స్వర్గంలో వున్న ఆయన ఆత్మ నన్ను క్షమించదు. మా దివాకర్ గాడేందిరా ఈ పనిచేసాడనుకుంటాడని అన్నాడు. ఎవరు సార్ ఆ గురువుగారు అని సిబ్బంది అడిగారు. ఇంకెవరు గాంధీజీ అని జేసీ చెప్పాడు. ఆయనకు మీకు సంబంధమేంటని సిబ్బంది అడిగారు. ఐదో తరగతిలో ఆయన గురించి వచ్చిన పాఠం చదువుకున్నాలే... అప్పటినుండి ఆయనతో నాకు మంచి ఫ్రెండ్‌షిప్... హేరామ్ అని అరిచాడు... అంతే ఆ క్షణంలోనే హేరామ్ హేరామ్ అంటూ చంద్రబాబు అరవసాగాడు. ఆ అరుపుకు ఉలిక్కిపడి భువనేశ్వరీదేవి లేచింది. హేరామ్ అని పదే పదే అరుస్తున్న చంద్రబాబు ముఖం మీద నీళ్లు చల్లింది. దెబ్బకు ఆయన లేచి కూర్చున్నాడు. ఏమైంది... ఎందుకు 'హేరామ్' అంటూ అరిచారు అని ఆమె అడిగింది. చంద్రబాబు తేరుకోవడానికి పది నిముషాలు పట్టింది. చింతమనేని ప్రభాకర్, కేశినేని నాని, జేసీ దివాకర్‌రెడ్డి సంఘటనలన్నీ తనకు కలలో వచ్చాయని గ్రహించాడు. అప్పుడు ఆయన భువనేశ్వరీదేవితో... రాత్రి గాంధీ గారిని గురించి ఆలోచిస్తూ పడుకున్నాను. మన పార్టీ నాయకులందరూ గాంధీ బాటలో నడుస్తున్నట్లు కల వచ్చిందని చెప్పాడు. అది విని భువనేశ్వరీ... మీ మైండ్‌సెట్‌కు సెట్‌కాని వ్యక్తుల గురించి ఆలోచిస్తే ఇలాంటి కలలే వస్తాయి. బంగారం లాంటి నిద్రను చెడగొట్టారు, ఇక పడుకోండి అని చెప్పి ఆమె తిరిగి నిద్రలోకి జారుకుంది. చంద్రబాబు మాత్రం పడుకుంటే మళ్ళీ కలలో ఎలాంటి ఘోరాలు చూడాల్సి వస్తుందోనని అలాగే మేల్కొని జాగారం చేశాడు.

# సమస్యల పరిష్కారం కోసమే ప్లీనరీలు

కావలి కబుర్లు

**- వైఎస్సార్సీపి నేత వై.వి సుబ్బారెడ్డి**



రాష్ట్రంలో వైఎస్సార్సీపి పటిష్టత కోసం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ప్లీనరీ సమావేశాలు నిర్వహించాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి అన్నారు. 17వతేదీ కావలి ఆర్ఎస్ఆర్ కళ్యాణమండపంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎంపీలు వై.వి సుబ్బారెడ్డి, రాజమోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గడచిన మూడు సంవత్సరాల్లో తెలుగుదేశం పార్టీ అక్రమాలు, భూ దందాలలో అభివృద్ధి చెందిందే తప్ప పేదప్రజల అభ్యున్నతికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల్లో సుమారు ఆరు వందల హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చ లేదన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, చంద్రబాబు మోసపూరిత మాటలను ప్రజలకు పూర్తిగా అర్ధమయ్యేవిధంగా వైఎస్సార్సీపి కార్యకర్తలు, నాయకులు ప్రజలకు వివరించాలని అన్నారు. రానున్న ఎన్నికలు వైఎస్సార్సీపి సవాల్‌గా తీసుకుని వైఎస్సార్సీపి విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కందుకూరు ఇన్‌ఛార్జి మాధవరావు, నాయకులు మేరిగ మురళి, ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'త్రిమూర్తులు' కలసి పనిచేస్తే తిరుగుండదు

ప్రస్తుతం కావలి నియోజకవర్గంలో వైఎస్సార్సీపిలో వున్న త్రిమూర్తులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ముగ్గురూ కలసి పనిచేస్తే కావలి వైఎస్సార్సీపికి తిరుగుండదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా మాజీఅధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. 17వతేదీ కావలిలోని ఆర్ఎస్ఆర్ కల్యాణమండపంలో వైఎస్సార్సీపి ప్లీనరీ సదస్సును ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గత కొద్దిరోజులుగా పార్టీలో అంతర్గత విభేదాలు కొనసాగుతున్నప్పటికీ పార్టీ మనుగడ కోసం పైకి కలసి పనిచేస్తున్నట్లుగా వుంటూ వచ్చారు. ఈ క్రమంలో సీనియర్, మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరినీ పార్టీ కార్యక్రమాలకు కొంత దూరంగా వుంచుతూ తమ బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు ప్రతాప్ వర్గీయులు. ఈ బల నిరూపణకు పార్టీ ప్లీనరీ వేదికకైంది. దీంతో కార్యక్రమాన్ని ముందు నుండి గమనించిన ప్రసన్నకుమార్‌రెడ్డి తమదైన శైలిలో ప్రతాప్‌రెడ్డిని సున్నితంగా మందలిస్తూ, విష్ణు-వేణులు పార్టీ పటిష్టత కోసం కలసిరావాలని సూచించారు. అనంతరం మాట్లాడిన ఎంపీ రాజమోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ప్రతాప్‌కుమార్‌రెడ్డికే టిక్కెట్ కేటాయించనున్నట్లు ప్రకటించడంతో ఒక్కసారిగా ప్లీనరీలో అలజడి మొదలైంది. విష్ణు అభిమానులు వెంటనే సమావేశం ఏర్పాటుచేసి దానికి ఖండన ఇచ్చారు. ఈ సమయంలో విష్ణు వారి అభిమానులను సంయమనం పాటింపజేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ పరిణామాలు కావలి వైఎస్సార్సీపిలో ఎటువైపు దారితీస్తాయోనని, వీరి మధ్య విభేదాలు ఏర్పడడానికి కారణం మధ్యవర్తులుగా వుండేవారేనని, వారిని కట్టడి చేయగలిగినప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

# బోర్లు పంపిణీలోనూ రాజకీయమేనా?

- రూరల్ విలీన ప్రాంతాల్లో రైతన్నల ఆవేదన
- పట్టించుకోని అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం చెప్పేదొకటి చేసేదొకటిగా ఉంటోందని, అందువల్ల ప్రభుత్వ పథకాలు సక్రమంగా అసలైన లబ్దిదారులకు చేరడం లేదని ఒకవైపు సామాన్యప్రజలు గగ్గోలు పెడుతుంటే, మరోవైపు అన్నదాతలదీ అదే మాటగా వుంది. దేశానికి వెన్నెముకలు రైతులేనంటూ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంటున్నప్పటికీ, రైతులకు సాయం చేయడంలో మాత్రం ప్రభుత్వం మీనమేషాలు పాటిస్తోందని, ఇందువల్ల రైతులు నిత్యం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అనేకమంది రైతులు వాపోతున్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ జలసిరి పథకం కూడా అదే దోవలో అసలైన లబ్దిదారులకు చేరకుండా పోతోందని, రాజకీయ అండదండలున్నవారు మాత్రం దానిని ఎలాగో సాధించుకుంటున్నారని, ఇదెక్కడి రాజకీయమని వారు వాపోతున్నారు. ప్రత్యేకించి నెల్లూరు రూరల్ మండలంలోని విలీన గ్రామాల్లో ఈ దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఎన్టీఆర్ జలసిరి పథకం కింద రెండు, లేదా రెండున్నర ఎకరాల పొలాన్ని అడంగల్ మీ-సేవలో ధరఖాస్తు చేసుకుంటే రైతులకు బోర్లు ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం అది నామమాత్రంగానే వుందని, రైతులందరికీ అది దరిచేరడం లేదన్నది వారి వేదన. ఉచితబోర్లు వస్తే ఎంతో ప్రయాస తప్పుతుందని ఆశపడిన రైతులు జిల్లావ్యాప్తంగా సుమారు 15వేల మంది ఆ పథకానికి ధరఖాస్తులు చేసుకుంటే కనీసం 15 వందల మందికి కూడా ఆ పథకం మంజూరు కాలేదని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో రెండున్నర ఎకరాల లోపు వున్న రైతులకు ఈ పథకం వర్తింపజేస్తామన్నారని, తీరా ఇప్పుడు మాటమార్చి మూడున్నర ఎకరాలకు మించి వున్న రైతులకు మాత్రమే వీటిని ఇస్తామంటున్నారని వారు పేర్కొంటున్నారు. ఆ ఇచ్చేది కూడా రాజకీయ వత్తాసు వున్నవారికి మాత్రమే ఇస్తున్నారే తప్ప సామాన్య రైతుల అతీగతీ పట్టించుకోవడం లేదని వారు బాధను వ్యక్తం చేస్తున్నారు.

## రైతులకు న్యాయం చేయాలి

**- వైఎస్సార్సీపి రైతునాయకుడు కొరపాటి మురళీనాయుడు**



'జలసిరి' కొందరికే సిరి అన్నట్లుగా తయారుకావడం విచారకరమని, అది రైతులందరికీ సిరి కావాలని, ఈ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్సీపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొరపాటి మురళీనాయుడు కోరారు. రాజకీయాలకు అతీతంగా బోర్లు అందజేయాలని ఆయన ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లోనూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, రూరల్‌మండలంలోని విలీన గ్రామాల్లో బోర్ల కోసం ధరఖాస్తు చేసుకున్న అందరు రైతులకు ఈ పథకం వర్తింపజేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా వుంటుందని ఆయన పేర్కొన్నారు. కొంత మందికి బోర్లు ఇచ్చినా, కరెంట్ సర్వీసులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిశీలించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

# పదిలో ప్రథములకు పురస్కారాలు



విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ టౌన్‌హాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ నెల 17న నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి జెఎస్ రెడ్డి ఆధ్వర్యంలో, 2016-17 సంవత్సరానికి నగరపాలక పాఠశాలల్లోని విద్యార్థుల్లో పదోతరగతిలో ప్రథమస్థానంలో నిలిచిన 45 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల వంతున నగదు ప్రోత్సాహకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి మువ్వా రామలింగం మాట్లాడుతూ, టౌన్‌హాల్ ట్రస్ట్ వారి సేవానిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డి, పొన్నాల రామసుబ్బారెడ్డి, సామంతు గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాన మాధుర్యంతో...


# పులకించిన పురమందిరం

### వేడుకగా ప్రపంచ సంగీత దినోత్సవం




శాస్త్రీయ, సినీ సంగీత మాధుర్యంతో పురమందిరం పులకించింది. ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు టౌన్‌హాలులో సంగీత విద్వాంసులు పాలపర్తి ఈశ్వరయ్య స్మృత్యంకంగా ప్రపంచ సంగీత దినోత్సవ వేడుక కార్యక్రమం జరిగింది. ప్రముఖ సంగీత విద్వాంసులు, ఔత్సాహిక కళాకారులు, గాయనీగాయకులు తమ గాత్రమాధుర్యంతో కీర్తనలు, పలు సినీ గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ప్రత్యేకంగా వీణాత్రయం వీణావాదన ఆకర్షణీయంగా నిలిచింది. సంగీత విద్వాంసులు ఎ.లక్ష్మీప్రసన్న, దేవసేన, ఎ.రమాదేవి, వనజలతల శిష్యబృందం గాత్రకచేరీలు ఆకట్టుకున్నాయి. పౌరాణిక నాటకాల్లోని పద్యాలను ప్రముఖ పౌరాణిక కళాకారులు వల్లకవి వేంకటసుబ్బారావు, పద్మనాభరాజులు ఆలపించి సభికుల కరతాళధ్వనులు అందుకున్నారు. ముఖ్యఅతిథులుగా నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కావలి మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, ప్రపంచ తెలుగుసమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, అభినవ ఘంటసాల పాటూరు శ్రీనివాసులు, విశ్రాంత ఎసిటివో పాలపర్తి సద్గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు కళాంజలి అనంత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా దువ్వూరు బెనర్జీ వ్యవహరించారు.

# ఇన్నర్‌వీల్ స్నేహలతారెడ్డికి అవార్డులు



ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలుగా వై. స్నేహలతారెడ్డి అందించిన సేవలకు అరుదైన అవార్డులు దక్కాయని, దీంతో క్లబ్‌కే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళామండలి క్లబ్ సభ్యులు కొనియాడారు. గూడూరు రోటరీ క్లబ్‌లో మంగళవారం రాత్రి క్లబ్ సభ్యులు స్నేహలతారెడ్డిని ఘనంగా సన్మానించారు. 2016-17 సంవత్సరాలకు గాను హ్యాపీ స్కూల్స్ ప్రోగ్రాం చేసినందుకు, కెమిస్ట్రీ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం చేసినందుకు గోల్డ్‌స్టార్ అవార్డు ఒకటి, సుప్రీంసూపర్‌స్టార్ గోల్డ్ అవార్డులు రెండు మొత్తం మూడు అవార్డులు వచ్చాయన్నారు. రోటరీ క్లబ్ టీచ్ ప్రోగ్రాం ద్వారా విద్యావ్యాప్తి కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, క్లబ్ అధ్యక్షురాలు సౌందర్యమ్మ, కె.సీతారెడ్డి, డాక్టర్ జయలక్ష్మి, జీవని, లక్ష్మీ పిఎంరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా 'యోగా' దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నెల్లూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. నెల్లూరు నగరం సరస్వతినగర్‌లోని రత్నం టెక్నో స్కూల్లో విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపల్ సుధ, వైస్ ప్రిన్సిపల్ ఖాసిం, సీనియర్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.



నెల్లూరు సరస్వతినగర్‌లోని మాడరన్ స్కూల్లో కూడా అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగాసనాలతో అలరించారు. విద్యార్థులకు యోగపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయ కుమార్‌రెడ్డి, డైరెక్టర్ రవికుమార్, ప్రిన్సిపల్ ఆర్. మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భక్తవత్సలనగర్ కెవిఆర్ మున్సిపల్ స్కూల్లో జరిగిన కార్యక్రమానికి అమృత, ఎరబోలు అపర్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హెర్నియా సర్జరీపై వర్క్‌షాపు



నెల్లూరులోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మొట్టమొదటిసారిగా హెర్నియా సర్జరీ వర్క్‌షాపును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్లో రోగికి హెర్నియా సర్జరీ చేస్తున్న విధానాన్ని స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేసారు. వర్క్‌షాపుకు వివిధ ప్రాంతాల నుంచి అనేకమంది వైద్యులు హాజరయ్యారు. అనంతరం హెర్నియా సర్జరీ వర్క్‌షాపు కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమార్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ హెర్నియా అతిసాధారణ సమస్య అని, దీన్ని ఆపరేషన్ ద్వారా మాత్రమే సరిచేయగలరన్నారు. ఆధునిక పద్ధతి(ల్యాప్రోస్కోపిక్) ద్వారా సరిచేయడం గురించి వివరించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ సాయిమహేష్, రాజశేఖర్, జమీల్, జిల్లాలోని ప్రముఖ శస్త్రచికిత్స వైద్య నిపుణులు పాల్గొన్నారు.

# బలముంది... బలమైన నాయకత్వమే కావాల్సివుంది

(5వ పేజీ తరువాయి)

సర్వేపల్లి విషయంలోనూ కొంత ఆలోచన చేయాల్సిన అవసరం వుంది. 2014 ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 30వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తాడనే అంచనాలుండినాయి. అదీగాక ఎన్నికల ముందు దాకా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లిని పట్టించుకోలేదు. అలాంటి సమయంలోనే కాకాణి కేవలం 5వేల ఓట్లతో గెలిచాడు. ఇప్పుడు సర్వేపల్లిలోనూ రాజకీయంగా సీన్ బాగానే మారింది. సిటింగ్ ఎమ్మెల్యేగా కాకాణి పట్ల ఎంతో కొంత వ్యతిరేకత వుంది. అటు చూస్తే ఓడినా కూడా సోమిరెడ్డి ప్రజల్లోకి చొచ్చుకు పోతున్నాడు. మొన్నటి వరకు ఎమ్మెల్సీగా, ప్రస్తుతం మంత్రిగా ప్రజలకు దగ్గరగా వుంటున్నాడు. నియోజకవర్గమంతటా సంబంధాలు పెంచుకుంటున్నాడు. గత ఎన్నికల్లో తనను వదిలి వెళ్లిన వారందర్నీ దగ్గరకు చేర్చుకుంటున్నాడు. ఇక్కడ తెలుగుదేశం పార్టీకంటే కూడా వ్యక్తిగతంగా సోమిరెడ్డే ఫోకస్ అవుతున్నాడు. జిల్లాలో ప్రస్తుతం తెలుగుదేశం బలంగా వున్న నియోజకవర్గాల్లో సర్వేపల్లి ఒకటిగా వుంది. కాబట్టి సోమిరెడ్డిని ఢీకొనే స్థాయిలో ఇక్కడ పార్టీలో మార్పులు జరగాల్సివుంది. ఇక గూడూరులో చూస్తే వైసిపి నుండి గెలిచిన పాశం సునీల్‌కుమార్ తెలుగుదేశంలోకి వెళ్లాక మేరిగ మురళీధర్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అతను సరిపోకపోవచ్చు. ఇక్కడకూడా కొత్త అభ్యర్థి ఎంపిక జరగాల్సి వుంది. వెంకటగిరిలో చూస్తే 2014 ఎన్నికల్లో ఓడిపోయాక కొమ్మి లక్ష్మయ్యనాయుడు పార్టీకి దూరంగా ఉంటున్నాడు. ప్రస్తుతానికి జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డే ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చూస్తున్నాడు. వచ్చే ఎన్నికల్లో అతనే అభ్యర్థిగా వుంటాడనే సమాచారం వుంది. అయితే ఎన్నికల్లోపు రాష్ట్ర స్థాయిలో సంభవించే పొత్తుల నేపథ్యంలో అభ్యర్థుల మార్పు జరిగే అవకాశముంది. ఇప్పటివరకైతే వెంకటగిరి విషయంలో రాఘవ తప్ప మరో పేరు లేదనిపిస్తోంది.

జిల్లాలో వైసిపికి ఓటుంది. ప్రభుత్వం పట్ల వ్యతిరేకత బలంగా వుంది. నాయకుల మధ్య సమన్వయం కావాల్సి వుంది. అలాగే బలమైన ఇంకొందరు నాయకులను కూడా పార్టీలోకి తీసుకురావాల్సిన అవసరముంది.

# రాముడికి పట్టం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి అభ్యర్థిగా అందరూ అద్వానీ పేరు వెలువడుతుందని ఆశించారు. నరేంద్ర మోడీ ఆ విధంగా అద్వానీ పట్ల తన గురుభక్తిని చాటుకుంటాడనుకున్నారు. బీజేపీని ఈ స్థాయికి చేర్చడంలో అద్వానీది కీలకపాత్ర! కాని ఆయనకు పార్టీ పరంగా కీలక పదవులేమీ రాలేదు. ఆయన స్థాయికి తగ్గ పదవి ఇక రాష్ట్రపతే! అది కూడా వయసురీత్యా ఇది చివరి అవకాశం ఆయనకు. ఇప్పుడు ఆయనను రాష్ట్రపతిని చేయలేకపోతే ఇంకెప్పుడూ చేయలేమని తెలిసి కూడా బాబ్రీకేసులో సిబిఐ ఛార్జ్‌షీట్‌ను సాకు చూపి ఆయనను పక్కన పెట్టారు. అద్వానీని రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటిస్తే తాము మద్దతునిస్తామని ఎన్డీఏతర పార్టీలు కొన్ని ముందుకొచ్చాయి. అద్వానీ పట్ల వారికున్న అభిమానం సొంత పార్టీ వారికి లేకుండా పోయింది. నరేంద్రమోడీ, అమిత్‌షాల ద్వయం అద్వానీ పేరును వ్యూహాత్మకంగానే వెనక్కునెట్టేసింది. ఆయన రాష్ట్రపతి అయితే ముందు ముందు తమకు సమస్యలు సృష్టిస్తాడనే భయం కావచ్చు, లేక తామిద్దరం కూడా గుజరాతీయులమే కాబట్టి మరో అత్యున్నత పదవి కూడా గుజరాతీలకే ఇస్తే... అన్నీ పదవులు మీకేనా అని ఇతర రాష్ట్రాల వారిలో వ్యతిరేకత వస్తుందనే ఆలోచన కావచ్చు... అద్వానీని పూర్తిగా పక్కన పెట్టేసారు. విపక్షాలపై తిరుగులేని దళిత బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించారు.

దళితనేత, బీహార్ గవర్నర్ రామ్‌నాథ్ కోవింద్ పేరును బిజెపి రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా బిజెపి తన ప్రత్యేకతను.. రాజకీయచతురతను మళ్లీ నిలబెట్టుకుంది. హేమాహేమీలెందరో ఈ పదవికి పోటీ పడుతున్నా, ఈ పదవికి బిజెపి ఎవరిని సూచిస్తుందా అని దేశంలో ఎంతో ఉత్కంఠత ఆవరించివున్న పరిస్థితుల్లో అనూహ్యమైన రీతిలో బిజెపి వివాదరహితుడు, సౌమ్యుడు.. సహృదయుడు, పేదల హక్కుల పోరాటయోధుడు.. అన్నిటికీ మించి బడుగు బలహీనవర్గాల వాణిని వినిపింపజేసే దళితనేత అయిన రామ్‌నాథ్‌కోవింద్ పేరును ప్రకటించి దేశాన్నే ఆశ్చర్యపరచింది. న్యాయవాద వృత్తి నుంచి ఎదిగి రాజ్యసభ సభ్యునిగా, ఆ తర్వాత గవర్నర్‌గా..ఇప్పుడు రాష్ట్రపతి అభ్యర్థిగా ఆయన జీవిత ప్రస్థానం ఎంతో విశేషమైనది. ప్రస్తుతం బీహార్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న 71 సంవత్సరాల కోవింద్ స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ దేహత్ జిల్లా దేరాపూర్ తాలూకా పారాంఖ్ అనే గ్రామం. 1945 అక్టోబర్ 1న ఆయన దళిత కుటుంబంలో జన్మించారు. కాన్పూర్ వర్శిటీలో బికాం, ఎల్ఎల్‌బి పూర్తిచేసి, 1971లో న్యాయవాదిగా స్థిరపడ్డారు. 1977–79 మధ్యకాలంలో ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేంద్రప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత న్యాయవాద వృత్తికే అంకితమయ్యారు. 1977 నుంచి కొంతకాలం పాటు జనతా పార్టీకి చెందిన అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయికి ఆర్థికశాఖకు సంబంధించి వ్యక్తిగత కార్యదర్శిగా, 1980–83 సంవత్సరాల్లో సుప్రీంకోర్టులో కేంద్రప్రభుత్వ స్టాండింగ్ కాన్సుల్‌గా, 1986లో ఢిప్రెస్ట్ క్లాసెస్ లీగల్‌ఎయిడ్ బ్యూరో జనరల్ సెక్రటరీగా పనిచేశారు. ఆలిండియా కోలీ (ఎస్‌సి) సమాజ్‌కు నాయకత్వం వహించారు. ప్రత్యేకించి ఆర్ఎస్ఎస్ నేపథ్యం వున్న కోవింద్ కమలదళానికి విధేయులు. మతానికంటే బడుగు బలహీనవర్గాల సాధికారత రాజకీయాలవైపే ఆయన ప్రధానంగా మొగ్గుచూపుతుంటారు. ఇక పోతే, ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఆయనకు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సన్నిహితునిగా పేరుంది. 1991లో లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఆయన ఉత్తరప్రదేశ్‌లోని ఎస్‌సి రిజర్వుడ్ సీటుగా వున్న ఘాటంపూర్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత 1994, 2006లో బిజెపి తరఫున రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. 12 ఏళ్లపాటు ఎంపీగా పనిచేసి, 2007లో తన సొంతజిల్లాలోని భోగినీపూర్ స్థానం నుంచి యుపి అసెంబ్లీకి పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత ప్రత్యక్ష, పరోక్ష ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. యుపి బిజెపి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కోవింద్ 1998–2002 మధ్య బిజెపి దళితమోర్చా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక సాధికారత కమిటీ సహా అయిదు పార్లమెంటరీ కమిటీల్లో వున్నారు. 2002లో ఐక్యరాజ్యసమితికి భారత బృందం సభ్యునిగా వెళ్లి అక్కడ ప్రసంగించారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చాక కోవింద్‌ను బీహార్ గవర్నర్‌గా నియమించారు. తాజాగా ఆయన పేరును బిజెపి రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించారు. ఈ విధంగా ఆయన ప్రస్థానం రాజ్‌భవన్ నుండి రాష్ట్రపతి భవన్ వైపుకు మళ్ళనుంది.

# 'కులం' కుంపట్లో 'దేశం'

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు కులం కార్డును బలంగా ప్రయోగించాడు. రాష్ట్రాన్ని కులాల కాష్టంగా మార్చాడు. రిజర్వేషన్లు, కార్పొరేషన్లు, ప్రత్యేక నిధుల పేరుతో రాష్ట్రంలోని దాదాపు అన్ని కులాలను రొచ్చులోకి దించివున్నాడు.

ఇప్పుడు అవే కులాలు చంద్రబాబుకు కంపరం తెప్పిస్తున్నాయి. కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ పద్మనాభం చేస్తున్న పోరాటంతో ఇప్పటికే చంద్రబాబుకు తల బొప్పి కట్టింది. చంద్రబాబు చేతిలో మోసపోయామని కాపులు ఇప్పటికే ఆగ్రహంతో వున్నారు. 2014 ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఓట్లేయించుకున్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీని అటకెక్కించడం తెలిసిందే! కేవలం కాపు కార్పొరేషన్ ఒకటి ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడు కాపులు బాబుకు వ్యతిరేకంగా వున్నారు. కాపు రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు బలహీన వర్గాల వారిలోనూ అలజడి రేపారు. కాపులను బీసీలలో చేర్చిస్తే ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన బీసీ కులాలన్నింటికీ ఇబ్బందే! చంద్రబాబు బీసీలలో కాపులను చేరుస్తామని హామీ ఇచ్చాకే బీసీలలోనూ చీలక వచ్చింది. బీసీలు చంద్రబాబు వ్యతిరేకమవుతున్నారు.

ఇక మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాలమహానాడుల మధ్య జరుగుతున్న వర్గీకరణ పోరులో కూడా చంద్రబాబు నలిగిపోతున్నాడు. రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతునిస్తారనే ఉద్దేశ్యంతో మందా కృష్ణ 2014 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతు పలికాడు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చాక వర్గీకరణ ఊసే లేదు. మాదిగ కులస్థులలో ఇది తీవ్ర ఆగ్రహం కలిగిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి మాదిగ వర్గీయులు చంద్రబాబుకు దూరమయ్యే పరిస్థితి వచ్చింది.

ఇక తాజాగా జరిగిన సంఘటన తెలుగుదేశం పార్టీకి రాజకీయంగా తీరని నష్టం కలిగించేదే! ఎన్నికలకు ముందు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయండని బ్రాహ్మణులెవరూ కోరలేదు. కాని అధికారంలోకి వచ్చాక చంద్రబాబే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. మాజీ చీఫ్ సెక్రటరీ, నిజాయితీపరుడైన ఐవిఆర్ కృష్ణారావును దానికి ఛైర్మెన్‌గా నియమించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా ఆయన పని ఆయనను చేసుకోనిస్తే బాగుండేది. కాని బ్రాహ్మణ కార్పొరేషన్‌లోనూ తెలుగుదేశం రాజకీయ జోక్యం పెరిగింది. ఎప్పుడూ తటస్థంగా వివాదాలకు అతీతంగా వుండే కృష్ణారావు కార్పొరేషన్‌పై రాజకీయ ఆధిపత్యాన్ని సహించలేకపోయాడు. దీనికితోడు సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టింగ్‌లను పోస్ట్ చేసాడని కృష్ణారావుపై ఆరోపణలు... ఈ నేపథ్యంలోనే పార్టీకి రాజకీయ మైలేజీ రావడం లేదంటూ ఆయనను బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్ పదవి నుండి అవమానకర రీతిలో తొలగించడం రాష్ట్ర వ్యాప్తంగా వున్న బ్రాహ్మణులలో ఆగ్రహం కలిగించింది. ఐవిఆర్ కృష్ణారావు గౌరవప్రదమైన వ్యక్తి. ఆయనపై అందరికీ అభిమానముంది. అలాంటి వ్యక్తిని అవమానిస్తే బ్రాహ్మణులు పూరుకుంటారా?

ఇలా రాష్ట్రంలో చంద్రబాబు స్వార్థం కోసం ప్రతి కులాన్ని కలబెట్టాడు. ఇప్పుడు ఆ కులాల రొచ్చులో తానూ మునిగిపోయే పరిస్థితి తెచ్చుకున్నాడు.

# కొత్త ఎస్పీగా రామకృష్ణ

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలు తీసుకున్నారు. అక్కడ 13నెలలు పని చేసిన అనంతరం బదిలీపై నెల్లూరు ఎస్పీగా వస్తున్నారు. విధినిర్వహణలో సమర్థవంతంగా పనిచేయడంతో పాటు సామాజిక స్పృహ వున్న అధికారిగా రామకృష్ణకు పేరుంది. మరి నెల్లూరులో ఎలాంటి పేరు తెచ్చుకుంటాడో చూడాలి.

ఇక ఇక్కడ నుండి బదిలీ మీద తూర్పుగోదావరికి వెళుతున్న విశాల్‌గున్నీ సినిమా ఎస్పీగా పేరు తెచ్చుకున్నారు. షోకు ఎక్కువ, సరుకు తక్కువ అన్నట్లు పనిచేశారు. ఎస్పీగా నెల్లూరులో తొలి పోస్టింగ్ అయినా యువకుడిగా వుండి కూడా పోలీస్ టెంపర్ చూపలేకపోయారు. నేరాల నిరోధానికి పోలీసుల్లో వుండాల్సిన శౌర్యం, ధైర్యం కంటే కంప్యూటర్‌లను, కమాండింగ్ కంట్రోల్ సెంటర్‌లనే ఎక్కువగా నమ్ముకున్నారు. జిల్లాలో పలు కార్యక్రమాల పేరుతో పలువురు నుండి పెద్దఎత్తున ముడుపులు దండారనే ఆరోపణలు కూడా మూటగట్టుకుని వెళుతున్నారు.

# మారనున్న రహదారుల పేర్లు... కొలువుదీరనున్న బార్లు!




*మన ప్రభుత్వాల పనితనం ఎలా ఉంటుందన్నదానికి ఓ చిన్న ఉదాహరణ... రోడ్ల మీద ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న పందులను కాల్చి పారేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందనుకుందాం... అప్పుడు మన ప్రభుత్వం ఏం చేస్తుంది? పంది పేరును నందిగా మారుస్తూ జి.ఓ తెస్తుంది. అప్పుడు రాష్ట్రంలో పందులుండవు నందులు తప్పితే! ఇక వాటిని చంపలేరు.*

ప్రస్తుతం మద్యం వ్యాపారం విషయంలోనూ మన రాష్ట్ర ప్రభుత్వం అదేపని చేస్తోంది. సుప్రీంకోర్టు తీర్పును తిరగ రాసేలా కొత్త ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. జాతీయ, రాష్ట్ర రహదారులకు 500మీటర్ల ఇవతల మద్యం షాపులు పెట్టకూడదని రెండు నెలల క్రితం సుప్రీం కోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో జులై 1వ తేదీ నుండి సుప్రీం ఆదేశాలను అమలు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ ప్రకారం టెండర్లువేసి, లాటరీ తీసి షాపులను కూడా ప్రకటించడం జరిగింది. అయితే సుప్రీం ఆదేశాలను అమలు చేస్తే నెల్లూరులో మినీబైపాస్‌రోడ్డుతో పాటు జిల్లాలోని పలు పట్టణాలలో ప్రధాన రోడ్లపై వైన్‌షాపులు, బార్లు మూసేయాల్సిన పరిస్థితి. ఇప్పటి వరకు ఎక్కువ మద్యం వ్యాపారం జరుగుతున్నది ఈ రోడ్ల మీదే! కాబట్టి ఈ రోడ్ల పేర్లు మార్చడానికే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డు 2013లో ఆర్ అండ్ బి పరిధిలో నుండి నేషనల్ హైవే పరిధిలోకి వెళ్లింది. దాదాపు 12కిలోమీటర్లున్న ఈ రోడ్డు ఇరువైపులా 11వైన్‌షాపులు, 8బార్లు వున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేస్తే ఒక్క వైన్‌షాపుగాని, ఒక్క బార్ కాని వుండదు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి పట్టణంలోనూ ఇదే పరిస్థితి. కాబట్టి ఈ మినీబైపాస్‌ను మేజర్ జిల్లారోడ్డుగా మార్చాలని చూస్తున్నారు. అయితే ఇది నేషనల్ హైవే అథారిటీ పరిధిలో వుండడంతో ముందు దీనిని ఆర్ అండ్ బి పరిధిలోకి తీసుకొచ్చి, ఆ తర్వాత మేజర్ జిల్లారోడ్డుగా మార్పు చేసుకోవాలని చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం వ్యాపారుల శ్రేయస్సు కోసం మద్యంషాపులుండే రాష్ట్ర రహదారులను మేజర్ జిల్లా రహదారులుగా మార్చి కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, పంచాయితీలకు అప్పగించాలని భావిస్తోంది. నెల్లూరు మినీబైపాస్‌ను తిరిగి ఆర్ అండ్ బి పరిధిలోకి తెస్తేగాని ఆ తర్వాత మేజర్ జిల్లా రోడ్డుగా మార్చుకోలేరు.

తాగుబోతులు, ప్రమాదాలను దృష్టిలో పెట్టుకునే జాతీయ, రాష్ట్ర రహదారుల వద్ద 500మీటర్ల లోపు వైన్‌షాపులుండకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది. వాళ్ల ఉద్దేశ్యం వాహనాల రద్దీవున్న రోడ్లపై మద్యం వ్యాపారం వద్దని! మన ప్రభుత్వం మాత్రం రద్దీవున్న రోడ్లపై కాకుంటే అడవుల్లో వైన్‌షాపులు పెట్టుకుని నడపాలా? అన్నట్లు అసలు రోడ్ల పేర్లే మార్చేయబోతోంది.

# విపిఆర్‌లో యోగ విన్యాసాలు




ఈ నెల 21వ తేదీన నెల్లూరురూరల్ కనుపర్తిపాడులోని విపిఆర్ విద్య స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగాసనాలతో అలరించారు. విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య నారాయణరెడ్డి పాల్గొని యోగ విశిష్టతను వివరించారు. శరీరాన్ని, మనసును ఏకాగ్రతతో కలపడమే యోగా లక్ష్యమని, యోగ ద్వారా అంతశుద్ధి, బాహ్య శుద్ధితో పాటు శారీరక, మానసిక వికాసం కూడా కలుగుతుందని చెప్పారు. విపిఆర్ విద్య పాఠశాలను ప్రారంభించినప్పటి నుండి కూడా యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్‌తో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్వర్ణాల చెరువుకు సరికొత్త సొగసులు

- 36 కోట్లతో ప్రతిపాదనలు
- 'ట్యాంక్‌బండ్' ఏర్పాటుకు ఆలోచనలు
- ఆహ్లాదం కానున్న పడవ ప్రయాణం



*ఎట్టకేలకు స్వర్ణాల చెరువు త్వరలోనే సరికొత్త సొగసులను సంతరించుకోబోతోంది. మనకంటూ నగరంలో ఒకమంచి ఆహ్లాదకర ప్రాంతం లేదే అని దిగాలుపడుతున్న పౌరులకు ఇదో ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతం కానుంది. సింహపురీయుల కల మరో ఏడాదిన్నరలోనే సాకారం కాబోతోంది. అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం కావడం సంతోషకరం.*

పురజనులు తీరికవేళల్లో ఆనందంగా, ఆహ్లాదంగా గడిపేందుకు నెల్లూరు చెరువు ఒక ఆహ్లాద కేంద్రంగా ఏర్పాటు కాబోతోంది. నగరాన్ని సుందర నందనం చేయాలనే ఆలోచనల్లో భాగంగానే, నెల్లూరు చెరువు (స్వర్ణాల చెరువు) అందుకు కేంద్రం కానుంది. దాదాపు 36 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఈ చెరువును అత్యంత సుందరంగా, ఒక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎంతో విశాలంగా వున్న ఈ చెరువు మధ్యలో ఒక ద్వీపాన్ని అభివృద్ధి చేయాలని, ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణదీక్ష చేసి అసువులు బాసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆ ద్వీపం మధ్యలో భారీస్థాయిలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లో వున్న బుద్ధుని విగ్రహం మాదిరిగానే శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటుచేసి, రాత్రి వేళల్లో సైతం ఈ ప్రాంతమంతా విద్యుత్ శోభలతో శోభాయమానంగా వుండేలా తీర్చిదిద్దాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చెరువు వద్ద అందమైన రీతిలో స్వాగత ద్వారాలు నిర్మించాలని, ఇక్కడకు వచ్చేవారిని బాగా ఆకట్టుకునేవిధంగా ఈ ప్రాంతంలో అన్ని విధాలైన హంగులు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. చెరువు మధ్యలో ఏర్పాటు చేయనున్న ద్వీపం ప్రాంతమంతా చక్కని పూల మొక్కలతో సుందరమైన ఉద్యానవనాన్ని కూడా ఏర్పాటు చేయాలని, పచ్చదనంతో.. పూలమొక్కలతో కళకళలాడేలా చూడాలని, మంచి రంగులు, అందమైన డిజైన్లతో.. నీటి ఫౌంటెన్‌లతో.. విద్యుత్ కాంతులతో ఆ ప్రాంతమంతా ఆకర్షణీయంగా వుండాలనే లక్ష్యంతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

అంతేకాదు, చెరువు కట్టమీది నుంచి చెరువు మధ్యలో వున్న ఆ ప్రాంతం దాకా వెళ్ళేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు అత్యాధునికమైన మరపడవలు కూడా సిద్ధం చేస్తున్నారు. చెరువును సందర్శించే ప్రజలకు, చిన్నారులకు పడవ ప్రయాణం ఒక మరపురాని అనుభూతిగా వుండేలా చూడాలని ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు చెరువు వద్ద వున్న ఏడెకరాల స్థలంలో యోగా కేంద్రం, క్రీడలకు ఏర్పాట్లు, ఆహార దుకాణాలు తదితరాలన్నిటినీ ఏర్పాటు చేయాలని, చెరువు చుట్టూ దాదాపు ఆరు కిలోమీటర్లు వున్న చెరువుకట్టను పటిష్టం చేసి, సైకిల్‌ట్రాక్, నడకదారి ఏర్పాటు చేసి ప్రజలకు ఆనందం..ఆహ్లాదం పంచాలని భావిస్తున్నారు. ఈ సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం నుంచి 36కోట్లు కేటాయించిందని, నిపుణుల బృందం దీనిని పరిశీలించి నివేదిక కూడా అందించిందని, త్వరలోనే ఈ పథకం అమలు కానుందని భావిస్తున్నారు. ఒకటిన్నర సంవత్సరం లోపే ఈ పనులన్నీ పూర్తిచేయాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు ప్రణాళిక రూపొందించి ఆ మేరకు పనులు త్వరితగతిన ప్రారంభ మయ్యేందుకు కృషిచేస్తున్నారు. ఇవన్నీ పూర్తయితే.. స్వర్ణాల చెరువుకు స్వర్ణకాంతులు వచ్చినట్లే మరి!...









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com